# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

ఈతరానికి చెరబండరాజు చిరునామా !




వందేమాతరం

ఓ నా ప్రియమైన మాతృదేశమా

తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా

దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలంనీది

అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందంనీది

సంపన్నుల చేతుల్లో మైమరిచి నిద్రిస్తున్న యవ్వనం నీది

జులై 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి

Editor@Prajakala.org

సూచిక

### కవిత్వం:


వందేమాతరం - చెరబండరాజు........ 3


### వ్యాసాలు:


ప్రజాకవి చెరబండరాజు సాహిత్యం ........ 4

చెర కవిత్వం - విప్లవ చైతన్యం - జె.సి........ 6

నెత్తుటి కళ్ళలో ఎత్తిన జెండా - శ్యామల........ 14

మనుషులూ, జంతువులూ - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్ ........ 16


### కవిత్వం:


నీ మృత్యువుతో - సర్వేశ్వర్ దయాల్ సక్సేనా........ 19

ప్రపంచం నిండా .... - చెరబండరాజు........ 23

కత్తి పాట - చెరబండరాజు........ 25

రైట్ టు ఒట్ కాదు - లోచన్........ 27

అతనికేం కావాలి? - రామా చంద్రమౌళి........ 28

సామాజిక న్యాయం వైపు - సురేష్ కుమార్ దిగుమర్తి ........ 31

నేలకొరిగిన చీకటి రాత్రి - సాజీగోపాల్ ........ 32


### కథలు:


కొత్త జోడు - చ. రా. ........ 34

చివరి కోరిక - డా. ఎస్.వి. రామరాజు........ 40


### పాటలు:


పాలపిట్టల పాటలు ........ 44

## వందేమాతరం - చెరబండరాజు

ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలంనీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందంనీది
సంపన్నుల చేతుల్లో మైమరిచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఊసినా దుమ్మెత్తిపోసినా చలనంలేని మైకంనీది
కోతకొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న
ఎలకల్ని పందికొక్కుల్ని భరిస్తూ నుంచున్న 'భారతి'వమ్మా
నోటికందని సస్యశామల సీమవమ్మా
వందేమాతరం వందేమాతరం

ఒంటిమీది గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న దైన్యం నీది
అప్పుతెచ్చి లేపిన మిద్దెల్లో
కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది
ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని
ఓదార్చలేని శోకం నీది
ఆకలికి ఎండి మాడి ఎరువు సొమ్ములతో వీధినబడ్డ సింగారం నీది
అమ్మా భారతీ నీ గమ్యం ఏమిటి తల్లీ
వందేమాతరం వందేమాతరం.

## ప్రజాకవి చెరబండరాజు సాహిత్యం

రాజులను పొగిడి, దేవుళ్ళను కీర్తించి భరణాలను పొందిన కవులున్నారు. ప్రభుత్వాలను మెప్పించి అవార్డులు గెలిచిన రచయితలున్నారు. కానీ జనం గుండెల్లో బాధను అర్థం చేసుకొని, అన్యాయంపైన పోరాడి, ప్రజలకు ఒక విప్లవ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందించిన కవులు కొందరే. విప్లవకవి చెరబండరాజు వారిలో ఒకరు. ప్రజాకవి చెరబండరాజు సంస్మరణలో భాగంగా, 25 వ వర్ధంతి సందర్భంగా, ప్రజాకళ ఆయన రాసిన కొన్ని రచనలను ప్రచురించింది. ముఖ్యంగా చెర ప్రసిద్ధిగాంచిన "వందేమాతరం" కవిత రాసారు.

"ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలంనీది...
ఒంటిమీది గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న దైన్యం నీది ..."

చెర కవితాశైలి లో సహజమైన భాష, పల్లె స్వచ్ఛదనం వున్నాయి. హృదయాంతరాలనుండి సూటిగా వచ్చే మాట, జనం గొంతు వినిపించే పాట వున్నాయి. ఆయన రాసిన వచనకవిత్వం, శక్తివంతమైన పాటలు జనం గుండెల్లో ముద్రవేసుకున్నాయి. జనం నాడిని కనిపెట్టి సందేశాన్ని సూటిగా చెప్పిన కవి చెరబండరాజు.

"అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందంనీది
సంపన్నుల చేతుల్లో మైమరిచి నిద్రిస్తున్న యవ్వనం నీది ....
అప్పుతెచ్చి లేపిన మిద్దెల్లో
కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది "

నేటి సామాజిక పరిస్థితులకు కూడా యీ కవితను అన్వయించుకోవచ్చు. దేశాన్ని తాకట్టు పెట్టడానికి, రైతులనుండి లక్షలాది ఎకరాల వ్యవసాయభూమిని కొల్లగొట్టి కోటీశ్వరులకు ధారాదత్తం చేయడానికి, నేటి ప్రభుత్వాలు 'స్పెషల్ ఎకానిమిక్ జోన్స్' పేరుతో వినూత్న పథకాలు తెస్తున్నాయి. రైతులు, రైతుకూలీల జీవనోపాధిపైన దాడిచేస్తున్నాయి. వ్యాపారవర్గాల లాభాలకోసం 'ప్రపంచీకరణ' పేరుతో సామ్రాజ్యవాద, పెట్టిబడిదారీ ఎజెండాను జనంపైన రుద్దుతున్నాయి.

దిగంబరకవిత్వం నుండి విప్లవకవిత్వం వరకు జరిగిన సుదీర్ఘప్రయాణంలో చెరబండరాజు సామాజిక వాస్తవాలను, నగ్నసత్యాలను, విప్లవ చైతన్యాన్ని వ్యక్తీకరిస్తూ ఎన్నో రచనలు చేసారు. అణగారిన వర్గాలు, దళితుల కోసం చివరివరకు పోరాడారు. చెరబండరాజుని హింసించి, పోలీసులు కేసులతో వేధించి, టార్చరు చేసి, పరోక్షంగా చంపివేసాయి అప్పటి ప్రభుత్వాలు మరియు పాలకవర్గాలు. తన కంఠంలో ప్రాణం వున్నంతవరకు, ఆఖరి శ్వాసవరకు జనంకోసం పోరాడాడు చెరబండరాజు.

మృత్యువునే

పరిహసిస్తు

శత్రువునూ

ఎదిరిస్తా

ముంజేతిని

ఖండించిన

నా పిడికిటి

కత్తివదల

జులై సంచికలో జె.సీ రాసిన విమర్శనాత్మక వ్యాసం " చెర కవిత్వం- విప్లవ చైతన్యం" , ప్రజా కవి సామాజిక-రాజకీయ దృక్పధాన్ని తెలియజేస్తుంది. "సెత్తుటి కళ్ళలో ఎత్తిన జెండా" వ్యాసంలో శ్యామల, చెరబండరాజు జీవితసహచరిణిగా తన జ్ఞాపకాలను పంచుకుంటారు. కవితలలో లోచన్ రాసిన "రైటు టు వోట్ కాదు", రామాచంద్రమౌళి రాసిన "అతనికేం కావాలి" మరియి ఇతర కవితలున్నాయి. డాక్టరు కొడవటిగంటి రోహిణీప్రసాద్ గారు రాసిన వ్యాసం "మనుషులు, జంతువులు" , కథలలో చ.రా రాసిన "కొత్తజోడు" , డాక్టరు ఎస్ . వి.రామరాజు రాసిన "చివరి కోరిక" వున్నాయి. తెలంగాణ పల్లె సామాజిక జీవితాన్ని చిత్రిస్తూ విప్లవకవి వరవరరావు రాసిన "పాలపిట్టల పాటలు" సంధ్యక్క, విమల, వేణు, రణం శ్రీను గానం చేసిన పాటలు వినండి.

సాహిత్యాభిమానులు, పాఠకులు, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులు, దళితులు, మైనార్టీలు మరియు విద్యార్థులు చెరబండరాజు సాహిత్యాన్ని అధ్యయనం చేసి, పాఠాలు నేర్చి నేటి సామాజిక పరిస్థితులకు అన్వయించవలసినదిగా ప్రజాకళ ఆహ్వానిస్తోంది.

పాఠకులు బాగా చదివే అత్యంత ప్రజాదరణ కలిగిన తెలుగు సాహిత్య పత్రికలలో ఒకటిగా ప్రజాకళ నిర్మాణం జరుగుతోంది ( జూన్ 2007 నెలలో 10,000 విజిట్స్ ). ఎందరో మిత్రుల, శ్రేయాభిలాషుల సమిష్టి కృషి వల్ల ఇది సాధ్యమైంది. మనం యీ ప్రగతిని నిలబెట్టుకోవటం, పత్రిక నిర్మాణాన్ని కొనసాగించటం ప్రజల చైతన్యాన్ని పెంపొందించే క్రమంలో అత్యవసరం. సమాజంలో చీకటి బ్రతుకులపైన కవితలు, కథలు రాయండి. ప్రజాకళ నిర్మాణానికి మీ రచనలు పంపించి, వాలంటీర్ కరస్పాండెంటు సేవలందిస్తూ, మీకు వీలైనంత సహాయం చేయండి

ప్రజాకళ సంపాదకవర్గం

## చెర కవిత్వం - విప్లవ చైతన్యం - జె.సి.

అదనపు విలువ దోపిడీని నిరంతరంగా కొనసాగించడానికి అనువుగా వర్గ సమాజం సృష్టించిన మార్మికత (mystification) ను సరుకులమాయ (commodity ferishism) ను అధిగమించి కవిత్వాన్ని తిరిగి నిజమైన విప్లవాచరణగా మార్చిన కొద్దిమంది కవుల్లో చెరబండరాజు అగ్రగణ్యుడు. దిగంబరకవిగా మొదలయి విప్లవ కవిగా ఆయనలో వచ్చిన మార్పు క్రమం విప్లవ గతితర్కానికి అనుగుణమైంది. ఈ మార్పు చెరబండరాజు విప్లవ కవుల్లో అగ్రగణ్యుడు కావడానికి ఎలా తోడ్పడిందో ఈ వ్యాసంలో చర్చిద్దాం.

సామాజిక చైతన్యరూపమైన కవిత్వం గతి తార్కిక చారిత్రక భౌతికవాదం ప్రకారం జ్ఞానసిద్ధాంతంతో ముడిపడి ఉంది. కవిత్వానికి భౌతికపునాది సమాజం. దాని మాధ్యమం సామాజిక భౌతికోత్పత్తి అయిన భాష. దాని సారం సమాజంలోని ఉత్పత్తి సంబంధాల చేత ప్రభావితమైన విలువల్ని సూచించే ప్రతీకలు. కాని దాని ప్రాణం మాత్రం కవిలో ఊహగా రూపొందిన అతని సామాజిక చైతన్యం. ఆ సామాజిక చైతన్యం ఎంత విప్లవాత్మకమైతే అంత గొప్పగా ఉంటుంది అతని కవిత్వం.

ఈ శతాబ్దంలోని అన్ని భాషల్లోని బూర్జువా కవుల కవిత్వంలో మాదిరిగా సమాకాలీన సామాజిక సంబంధాలకు అద్దంపట్టేది మాత్రమే అయితే ఆ కవిత్వం యధాతథవాదంలో భాగమే. అంటే వర్గసమాజపు కుట్రలో భాగమన్నమాట. అలా కాకుండా వర్గసమాజపు మార్మికతను (సరుకుల మాయ కూడా ఆ మార్మికతకు మారు రూపమే.) అంటే అదనపు విలువను దాని ఉత్పత్తిదారుని ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, మాయతో దోపిడీ చేయడానికి సృష్టించిన సామాజిక పరిస్థితిని బట్టబయలు చేసేదే నిజమైన కవిత్వం. ఉదాహరణఖు వేమన పద్యాలు. అయితే ఈ రకమైన కవిత్వం ఎలా ఆవిర్భవిస్తుంది.

భౌతిక ప్రపంచాన్ని గురించిన జ్ఞానాన్ని మనిషి గతితార్కిక పద్ధతి ద్వారా సంపాదిస్తాడు. బాహ్యప్రపంచాన్ని, దానిలో జరిగే భౌతిక మార్పుల్ని తన ఇంద్రియాల ద్వారా గ్రహించి మనిషి, ఆ అనుభవాన్ని ఒద్దికగా అమర్చుకొని, క్రోడీకరించి తద్వారా భావాల్ని, ఉద్దేశాల్ని ఏర్పరుచుకొని విజ్ఞానాన్ని సంపాదిస్తాడు. ఆ జ్ఞానంతో ప్రపంచాన్ని తిరిగి చూస్తాడు. ఈసారి అతడు తన ఇంద్రియాల (కళ్ళు, ముక్కు, చెవులు మొదలగునవి) ద్వారా గ్రహించే జ్ఞానం ఉత్తమంగా ఉంటుంది. ఈ విధంగా ఎప్పటికప్పుడు తప్పుల్ని సవరించుకొంటూ విజ్ఞానాన్ని పెంచుకొంటూ పోతాడు అతడు. కవి తన కవిత్వ విషయంలో అనుసరించే పద్ధతి కూడా సరిగ్గా ఇలానే ఉంటుంది. అయితే అతని భౌతికపునాది సమాజం, బాహ్య ప్రకృతి గురించి రాసినా, అతని వస్తువు సమాజమే.

తన చుట్టూ ఉన్న సమాజంలో, వర్గసమాజంలోని మార్మికత (దేముడు, దెయ్యాలు, పురాణాలు, అమూర్తమైన విలువలు) కారణంగా సామాన్యునికి పూర్తిగా అర్థం కాకుండా పోయిన సామాజిక సంబంధాలను, వైరుధ్యాలను కవి గ్రహించగలడు. అసంపూర్ణమే అయినా సామాన్యుని అనుభవం కూడా కవి అనుభవాన్ని సంపూర్ణం, స్పష్టం చేయడానికి పనికి వస్తుంది. తన పరిశీలనా గ్రహణశక్తులు జ్ఞానం ద్వారా సామాన్యుని కంటె ఎక్కువగా సామాజిక

చైతన్యాన్ని తనలో పెంపొందించు కొన్న కవి తాను నివసిస్తున్న సమాజంలోని సంబంధాలను, విలువలను తన కందుబాటులో ఉన్న భాష ద్వారా, కళారూపాల ద్వారా తన కవిత్వంలో ప్రదర్శింపగలడు. అయితే, తాను దర్శించిన సామాజిక సంబంధాల మార్మికతలో తన వ్యక్తిత్వాన్ని పోగొట్టుకొనకుండా వాటిలోని వైరుధ్యాల్ని గుర్తించి, పాలకవర్గాలకు, పీడితులకు సమాజంలో నిరంతరం జరిగే పోరాటాన్ని (మార్క్సిస్టు దృక్పథంతో కాకపోయినా) చైతన్యవంతంగా ప్రదర్శింపగల్గితేనే గాని అతడు మంచి కవి కాజాలడు. అలాంటి చైతన్యవంతమయిన కవికి తను కలలుగనే ప్రపంచం యొక్క భౌతిక వాస్తవికత, సిద్ధాంత జ్ఞానం ఉంటే అతని కవిత్వంలో నిజమైన ప్రాణం ఉంటుంది. ఈ చివరి కోవకు చెందిన కవే చెరబండరాజు.

కవికి భాష, కవితారూపాలు ప్రతీకలు, ముడిపదార్థాలు. భాష, కవితా రూపాల (పాట, వచనకవిత, ఛందో పద్యం) విషయంలో కవి అంతగా స్వతంత్రించలేడు. అవి సమాజమతనికిచ్చిన భౌతిక రూపాలు. వాటిని కొత్త కొత్త రీతుల్లో వాడినా, కవి ముఖ్యంగా తన వ్యక్తిగత నైపుణ్యాన్ని ప్రతీకల విషయంలోనే ప్రదర్శించుకొంటాడు. ప్రతీకను నిర్మించే తీరులోనే అతని గొప్పతనం కన్పిస్తుంది. అయితే కవి ప్రతీకను నిర్మించే తీరు కూడా గతితార్కికమైందే.

ఒక సామాజిక పత్యాన్ని (అనగా ఒక చారిత్రక సామాజిక సంబంధాన్ని) కవి గ్రహిస్తాడనుకొందాం. ఆ సత్యాన్ని దాదాపుగా సమాజంలోని అందరు వ్యక్తులూ గ్రహించి ఉండవచ్చు. అది ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పాక్షికంగా కన్పించి ఉండవచ్చు. ఉదాహరణకు: ఈ దేశంలో అధిక సంఖ్యాకులకు కట్టుకొనేందుకు గుడ్డ, తింటానికి తిండి, ఉండటానికి ఇల్లు లేవన్న సంగతి అందరికీ తెలుసు. అయినా వీరికి, వీరి అసవరాలకు లేని విలువ ఈ దేశపు పాలకవర్గాలు జాతిపై బలవంతంగా రుద్దిన జెండాకుంది. కోట్లాది ప్రజలకు కట్టుకోడానికి సరిపోయేంత గుడ్డ ఇవ్వలేకపోయినా (గాంధీగారి ప్రవచనాల మీది గౌరవంతోనైనా) సంవత్సరానికి రెండుసార్లయినా లక్షలాది తాన్లతో తయారుచేసిన మూడురంగుల జెండా ఎగురవలసిందే. ఎందుకంటే అది జాతి గౌరవానికి సంకేతం. కోట్లాది ప్రజల అవసరాలు తీర్చలేనపుడు జెండాకు అంత గొప్ప విలువ ఇవ్వడం సత్యాన్ని మసిబూసి మారేడుకాయ చెయ్యడమే అవుతుందన్న సాంఘికసత్యం తెలిసినవారు అరుదు. చాలామందికి జెండా నిరాకారమయిన జాతి గౌరవానికి సంకేతమనే తెలుసు. ఇంకా చాలామందికి ఈ దేశంలో కోట్లాదిమంది గుడ్డల్లేకుండా బతుకుతున్నారని తెలుసు. కాని దీనికి కారణం అదనపు విలువ ఎడతెగకుండా ధనికులైన పాలకవర్గాల జేబుల్లోకి పోవడం అని తెలియదు. జెండా నిజానికి పాలకవర్గాల ప్రభుగర్వానికి సంకేతమని తెలియదు. ఈ విధమైన పాక్షిక జ్ఞానం ఉండటానికి ఉత్పత్తి సంబంధాల్లోని మార్మికతే కారణం అన్న నిజాన్ని, కోట్లాదిమంది బట్టల్లేకుండా మగ్గుతున్నపుడు ఇంకా జాతి గౌరవమేమిటి, జెండాయేమిటి అన్న సత్యాన్ని, 'జెండా గౌరవం' అన్న భావం వెనుకనున్న ఉత్పత్తి సంబంధాల్లోని వైరుధ్యం గురించిన జ్ఞానం కలిగినవారు బహు కొద్దిమంది. చాలామందికి తెలియని ఈ సామాజిక సత్యాన్ని సూటిగా హృదయాలకు హత్తుకొనేటట్లు ప్రతీకరించి చెప్తాడు ఒక కవి:

ఓ నా ప్రియమైన మాతృదేశమా

...........................................
...........................................
ఒంటిమీది గుడ్డలతో జండాలు కుట్టించి

వివస్త్రనై ఊరేగుతున్న ధైర్యం నీది

తల్లి ప్రేమ అందరికీ తెలిసిందే. తన బిడ్డలపై ఉన్న ప్రేమ కారణంగా తన ఒంటిపై గుడ్డలు సరిగా లేకున్నా పిల్లలకు అమర్చిపెట్టజూస్తుంది తల్లి. కాని భారతదేశమనే తల్లి మాత్రం ఒంటి మీద గుడ్డలతో జెండాలు కుట్టించి వివస్త్రయి ఊరేగుతున్నది ఎందువల్ల? స్వార్థపరులైన పాలకవర్గాల కుట్ర వల్ల అన్న సమాధానం స్ఫురిస్తుంది వెంటనే. చెరబండరాజు రాసిన ఈ కవితను చదివినవారికి మాతృదేశమంటే మట్టి కాదు ప్రజలు అన్న విషయం విడమర్చి చెప్పనవసరం లేదు.

ఈ ప్రతీకలో కవి చేపట్టిన గతి తార్కిక విధానం ఇది: చాలామందికి మార్మికత వల్ల పాక్షికంగా మాత్రమే అర్థమయిన సామాజిక సత్యాన్ని ఒక భావంగా చేసి (ఈ పని సామాజిక శాస్త్రవేత్త చేసేది) దాన్ని కవితారూపం చేశాడు కవి. కవితాపరం చేయటంలో కూడా గతితార్కిక విధానాన్నే అనుసరించాడు. 'మాతృప్రేమ' అనే తెలిసిన విషయాన్ని అస్పష్టమైన భావానికి ఆపాదించి, చాలామందికి పాక్షికంగా అర్థమైన విషయాన్ని లేక సులభంగా అర్థంకాని విషయాన్ని హృదయానికి హత్తుకొనేటట్లు చెప్పాడు. మార్మికత, సరుకులమాయలో పడి జటిలమైన భావాన్ని, పాలకవర్గాల కుట్రను సులభగ్రాహ్యంగా, సూక్ష్మంగా, స్పష్టంగా బట్టబయలు చేశాడు కవి. దిగంబర కవితాకాలంలో రాసిన 'వందేమాతరం' అన్న ఈ కవితలో చెర ముందు చెప్పబడిన మూడవకోవకు చెందిన కవిగానే దర్శనమిస్తారు. మిగతా దిగంబరకవుల మాదిరి కాకుండా, (అప్పటికి అతనికి మార్క్సిస్టు సిద్ధాంతావగాహన సంపూర్ణంగా లేనప్పటికి) సమాజంలోని పీడితవర్గాలతో భావైక్యత పరిపూర్ణంగా ఉంది.

"కోపంతో, ఉద్రేకంతో తిరగబడి మత, రక్తబాంధవ్యాల ముళ్ళపొదలపై, శిథాలవ్యవస్థపై, జడత్వంపై సంచలనాన్ని లేవదీసి, మరో మహత్తర వ్యవస్థ కోసం తపన పడుతున్న కోపోద్రిక్త యువకుల నడుమ, (దిగంబర శకం లోంచి / సమకాలీన జీవితంపై దిగంబర కవుల దృక్పథం / మేం ఏం కోరుతున్నాం, దిగంబర కవులు: సంపుటి: 2) నిలబడి సమకాలీన వ్యవస్థపై ధ్వజమెత్తినప్పటికీ దిగంబరకవులు పీడితుల తరఫున వర్గపోరాటానికి సిద్ధం కాలేకపోయారు. అందుక్కారణం వారు కూడా వర్గవ్యవస్థ నిర్మించిన మాయాజాలంలో ఇరుక్కుపోయి, ఏ మతాలతోను, ఇజాలతోను నిమిత్తం లేకుండా అసలు విలువల కోసం, కత్తి అంచుపై కూడా మానవత్వాన్ని మరచిపోని నైరూప్య మానవుని కోసం తపించడమే. తత్ఫలితంగానే వారి దిక్‌లలో అశ్లీలం, అక్కసులపాలు ఎక్కువై కేవలం అప్పటి యాంత్రిక అభావ ధోరణి చోటు చేసుకొన్నది. కాని చెరబండరాజు కవితల్ని పరిశీలిస్తే వాటిలో మనకు కనిపించే మానవుడు నైరూప్య మానవుడు కాడు. అతడు క్రోధంతో, ఎగసిపడేది దోపిడీదారునిపైన, సానుభూతి చూపించేది పీడితులపైన. దిగంబర కవిగా కూడా అతనిలో విప్లవాత్మక వర్గచైతన్యం సూచనప్రాయంగానైనా కన్పిస్తుంది. ఆ చైతన్యమే అతణ్ణి విప్లవకవిగా ఎదగడానికి దోహదం చేసింది.

ఆపకండి
వెనక్కి పిలవకండి
మీ మాసిక ఏకాకితనం శిఖరాల మీద

కాంతి పాదాలతో కదం తొక్కుతూ

నడుస్తున్న వాణ్ణి

…………………………………………..

…………………………………………..

పాలిపోయిన నరనరాన్ని పితికి

జీవనదికి ఊటలు సృష్టించేవాణ్ణి

మీ అస్తిత్వాన్ని ఆశయాల్ని కాలదన్ని

మీ కలల్ని పావులుగా చదరంగం ఆడేవాళ్ళ

ఆట కట్టించేవాణ్ణి

……………………………………………..

……………………………………………..

మోయలేని చట్టాల గులకరాళ్ళ తట్టలు మోయించేవాళ్ళని

వాళ్ళ డబ్బాల్ని వాయించే అపర శిఖండుల్ని

పట్టపగలు బట్టబయలు చేసేవాణ్ణి

ఆపకండి

ఆపకండి

వెనక్కి పిలవకండి

(కాంతి పదాలు, దిక్‌సూచి, పుట 2230)

దిగంబర కవుల రెండవ సంపుటిలో 'దిక్ ఇరవైతొమ్మిది' అన్న శీర్షిక గల ఈ కవితలో, తాము సృష్టించిన అదనపు విలువ పరాయీక్రమణ చెందే క్రమంలో, కేవలం సరుకులనుత్పత్తి చేస్తూ, సరుకుల స్థాయికి దిగజార్చబడి, అపరకులమాయ సృష్టించిన 'మానసిక ఏకాకితనం'లో మగ్గుతున్న శ్రమజీవుల నుద్దేశించే కవి మాట్లాడుతున్నాడన్నది స్పష్టం.

'ఆ శ్రమజీవుల తలల మీది చంద్రుణ్ణి ముక్కలు చేసి, వారికి చీకటి అఖాతాల్ని మిగిల్చి

ఎందుకు ఏమిటి అని

ఎదిరించే హక్కు లేదని వాదించే గాడిదల

నాలుకలు పీకేవాణ్ణి'

అని కూడా అంటున్నాడు. శ్రమజీవుల బతుకు సౌందర్యమే వారి తలల మీది చంద్రుడు. వారి జీవన సరళి వెన్నెల్లాంటిది. వారి నిజమైన ప్రపంచం వాడుక విలువల ప్రపంచం, కాని వారి బతుకు చంద్రుణ్ణి ముక్కలు చేసి, వారి జీవితాల్లో సామాజిక శ్రమ సృష్టించే అన్యోన్యతను, ఐక్యతను, వెలుగుల సరుకుల మార్పిడిమాయతో భగ్నంచేసి మనిషికి మనిషికి మధ్య చీకటి అఖాతాల్ని సృష్టించి ఎదురుతిరిగి ప్రశ్నించే హక్కును కూడా కాలరాయ ప్రయత్నించే 'గాడిదలు' పాలకవర్గాలు. వాళ్ళు పన్నిన కుట్ర శ్రమజీవన సౌందర్యాన్ని అభావం చేసింది. ఆ అభావాన్ని అభావం చేసి శ్రమజీవి తలపై తిరిగి చంద్రుణ్ణి నిలబెట్టి వారి జీవితల్లో తిరిగి వెన్నెల వెలిగేట్టు చేయడానికి

కవి ఉద్యుక్తుడౌతున్నాడు. అనగా తన కవిత్వాన్ని, జీవితాన్ని విప్లవాచరణలో భాగంగా మలచుకోవడానికి తయారౌతున్నాడన్నమాట.

చంద్రుడూ, అఖాతాలు రెండూ పరిచితమైన అంశాలు. తన ప్రతీకల్లో వాటి నాపాదించి శ్రమజీవన సౌందర్యమెలా వర్గదోపిడీలో అభావం చెందిందో, దాని వల్ల మనిషికీ మనిషికీ మధ్య ఎలాంటి సామాజిక అగాధం, చీకటి సృష్టించబడిందో చెర చెప్పిన తీరు కవిత్వంలో గతితార్కికతకు మచ్చుతునక.
ఈ విధంగా దిగంబర కవితాకాలంనాటి చెర కవిత్వం కూడా అదనపు విలువ దోపిడిని నిరాఘాటంగా సాగించడానికై పాలకవర్గాలు ప్రతిష్ఠించిన మాయాజాలాన్ని బట్టబయలు చేయడానికి చేసిన ప్రయత్నమే. కాని, కవిగానే కాక ఒక వ్యక్తిగా దేశంలో నలుమూలలా ఎదిగి వస్తున్న విప్లవ పోరాటంలో భాగంగా విప్లవాచరణకు పూనుకోవడం జులై 1970లో పుట్టిన విరసంతో చెరబండరాజుకు సాధ్యమైంది. విరసం పిలుపందుకొని వచనకవిత్వంతో పాటు పాటలు రాయటం మొదలుపెట్టాడు. కేవలం కవిత్వం ద్వారానే వర్గసమాజపు మాయాజాలాన్ని బట్టబయలు చేయడంగాక మార్క్సిస్టు-లెనినిస్టు రాజకీయ సిద్ధాంతం సహాయంతో తన వ్యక్తిగత జీవితంలో కూడ విప్లవచారణకు పూనుకొన్నాడు. ఇప్పుడు చెర విప్లవయోధుడైన కవి. సాంస్కృతిక విప్లవయోధుడు. విప్లవాచరణకు ఆవశ్యకమైన జాగరూకతతో ఉషస్సులా నిర్మలమైన, మనస్సుల్లా సున్నితమైన శ్రమజీవుల్ని తన పాపలూ, కనుపాపలుగా భావించి, ఎన్నికల మార్మికతా ముసుగులేసుకొని వారిపై దాడి చేసే రాజకీయ డేగల గురించి హెచ్చరిస్తున్నాడు.

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల డేగలు
రక్తం తాగే రాబందుల మూకలు
కలల కరివేపాకు చెట్లూ
కళ్ళ లోగిళ్ళలోని ఆశా ప్రసూనాలు
పాపలూ కనుపాపలూ జాగ్రత్త
రెండు దశాబ్దాల గాయాల నొప్పులతో
విసిగి వేసారిన సూర్యుడు
రాజీలేని ఎర్రని మంటలతో
ఇపుడిపుడే ఇంటింట తలుపు తడుతున్నాడు
మొత్తంగా రెక్కలిప్పి
ఇనుప ముక్కులకూ ఉక్కుగోళ్ళకూ
లే చిగుళ్ళ కవచాలు కప్పి
దేశం ఆకాశం నిండా
దోపిడీ, దేశభక్తి గీతాలు పాడుకుంటూ
పుక్కిటి నిండా పుచ్చు వాగ్దానాల గింజల్ని నములుకుంటూ
………………………………………………

.....................................................
ఊళ్ళో వాటికి గూళ్ళున్నాయి గుళ్ళున్నాయి
అంతశ్శత్రువుల పళ్ళ మధ్య
మన యిండ్లూ నలిగే వున్నాయి
(మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి, ముట్టడి, పుట: 41- 42)

అయినా భయపడాల్సిన అవసరం లేదు అని చెపుతున్నాడు. ఎందుకంటే,

'శత్రు శిబిరాల శిఖరాగ్రాల మీదికి
దోపిడీ గుండెల పాదాల మీదికి
పోరాటం బండల్ని దొర్లించి
ఊరూరికి ప్రాకుతున్న
ఎరుపుండగ నెరపేటికి.'

ఇప్పుడిప్పుడే రాజీలేని ఎర్రని మంటలతో ఇంటింటి తలుపు తడుతున్నది విప్లవోదయ సూర్యుడు. అతని వెలుగు ఊరూరికి ప్రాకుతున్నది. విప్లవ పోరాటం ప్రజా జీవితంలో ఒక ఉన్నత దశ. పోరాటం ఎత్తుల నుండి శత్రు శిబిరాల మీదికి, దోపిడీ గుండెల పాదాల మీదికి విప్లవం పోరాటం బండల్ని దొర్లిస్తే అవి నాశనం కాక తప్పవు. అందరికీ పరిచితమై ప్రకృతి సత్యాలనుపయోగించి సిద్ధాంతజ్ఞానాన్ని కల్గించ ప్రయత్నిస్తున్నాడు కవి ఈ ప్రతీకల్లో. అలాగే 'ఎరుపు' (విప్లవం) అంటే 'మన పేదల ఎదల మొదళ్ళలోని ఎరుపు', 'ఎదల మొదళ్ళు' ప్రేమకు, కరుణకు, మానవత్వానికి ఉత్పత్తి స్థానాలని ఎవరికీ చెప్పనవసరం లేదు. ఇలాగే ఇంకా ఎన్నో కవితల్లో చెర విప్లవాన్ని రంగరించి వర్గవ్యవస్థలో శ్రమజీవుల జీవితసత్యాల్ని, సిద్ధాంత జ్ఞానాన్ని చెప్తాడు.

విప్లవాచరణమైన అతని కవిత్వానికి ఇప్పడు భౌతిక పునాది చైతన్యవంతమైన పోరాటం. అది నక్సల్బరీలో ప్రారంభమైన విప్లవ పోరాటం. పోరాటానికి, కవిత్వానికి మధ్య గతితార్కిక సంబంధంలో అతడు చాలా నేర్చుకుంటాడు. నేర్పిస్తాడు. 'అంకితం' (ముట్టడి) అన్న కవితలో చెప్పినట్లుగా ఇవ్వాళ్ళ ప్రపంచం అతనికి 'మా పల్లెటూరి కన్నా చిన్నది'గా (సంకుచితంగా కాదు, ఆత్మీయతకు, ఐక్యతకు, నిజమైన సహకారానికి అవకాశం కలిగించే శ్రమైక జీవనసరళిగల పల్లెటూరి వలె) కన్పిస్తుంది. అతని షెల్ఫులోని పుస్తకాల్లా చేతి వేళ్ళలా మరీ మరీ దగ్గరై అందుబాట్లో ఉన్నది. అతన్ని ఈ దృష్టికి నడిపించినవారు ఎక్కడో లేరు, ఎవరో కారు.

వాళ్ళు చరిత్ర రహస్యాల్ని ఛేదించిన వీరులు.
నా గురువులు నా వాళ్ళు.'
వాళ్ళు చరిత్రకు యవ్వనం ప్రసాదించిన వైద్యులు.'
పోరాటాలకు పర్యాయపదాలు.
వర్గదృష్టి నిశితం కానిదే కనబడనివాళ్ళు.

అయితే, వాళ్ళు విప్లవ సైద్ధాంతికులా? కారు,
విప్లవకారులైన శ్రమజీవులు.

చివరగా 'నేనూ నా గీతం వాళ్ళకే అంకితం' అని తననూ, తన కవిత్వాన్ని శ్రమజీవులకు అంకితం చేసుకుంటాడు చెరబండరాజు. ఈ విధంగా చెరలో వర్గదృష్టి నిశితమయ్యి, పీడితుల పక్షాన వారి బతుకుపోరాటంలో ఐక్యమయ్యి వారి కోసం పాటను తన కవితారూపంగా ఎంచుకున్నాడు చెర.
శ్రమలో పుట్టి శ్రమజీవుల బతుకుల్తో పెనవేసుకొని వర్గసమాజంలో అజ్ఞాతవాసం చేస్తున్న పాటను విప్లవాచరణలో భాగంగా చేసుకోవడం వర్గ సమాజపు అభావాన్ని అభావం చేసే కార్యక్రమంలో పెద్ద మలుపు చెర కవిత్వంలో విప్లవ పోరాటానికి అంకితమైన విరసం, జననాట్యమండలుల క్కూడా సరుకులమాయ ఫలితంగా శ్రమజీవుల బతుకులో పాట కూడా మృగ్యం అవుతున్న సమయానికి విప్లవాచరణలో భాగంగా పాటను ఎంచుకొని శ్రమజీవన సౌందర్యాన్ని పరిరక్షించడానికి పూనుకొన్న సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్, గద్దర్‌ల సరసన చెర కూడా అంత ఎత్తుకు ఎదిగాడు.

'కొలిమంటుకున్నాది' నుండి 'కత్తిపాట' వరకు ఒక్కొక్క పాట ఒక్కొక్క ఉత్కృష్టమైన విప్లవ కవితాగ్ని శకలం. (ఇటీవలనే విరసం 1971 నుండి 1980 వరకు చెర రాసిన పాటల్ని కత్తిపాటగా ప్రచురించింది.) 'కొలిమంటుకున్నాది' పాటలో శ్రమజీవి బతుకుని పోరాటానికి, పోరాటాన్ని శ్రమజీవి దైనందిన జీవితానికి ప్రతీకలుగా చేశాడు కవి. శ్రమజీవి బతుక్కీ పోరాటానికి మధ్య ఉన్న గతితార్కిక సంబంధం నుంచే శ్రామిక జనచైతన్యం పుడుతుంది. ఆ చైతన్యాన్ని ఇంకా ప్రజ్వలింపజేసి వ్యవస్థాపరమైన మార్పుల్ని సాధించాల్సిన అవసరం గురించి చెర వాడిన 'కొలిమి' ప్రతీక ఆ చైతన్యంతో పూర్తి ఐక్యత సాధించిన సామాజిక చైతన్యంలోంచి ఉద్భవించిందే.

కొలిమంటుకున్నాది
తిత్తి నిండా గాలి
పొత్తంగ ఉన్నాది
నిప్పారిపోనీకు- రామన్నా
పొద్దెక్కిపోనీకు- లేవన్నా (కొలిమంటుకున్నాది, కత్తిపాట 1- 2)

'ఓటు కెదిగిన బిడ్డ (పెళ్ళి లేకున్నాది)' అన్న ప్రతీకలోని ధ్వనులు వర్గసమాజపు రాజకీయాల్లోని మార్మికతను, మాయను లేక కుట్రను అభావం చేసి చూపించే కవిత్వకళలో చేయి తిరిగిన చెరలాంటి కవికి గాని సాధ్యపడదని చెప్పవచ్చు. 'స్వతంత్ర భారతం', దానితో పాటు ఎదిగివచ్చిన బిడ్డ- ఆ ఇద్దరూ పాలకవర్గం కుట్రకు బలి అయినవారే. ఇక్కడ దేశం బిడ్డ స్థానాన్ని పొందింది. కూలినాలి చేసి శ్రమజీవి దేశమనే బిడ్డకూ, సొంతబిడ్డకూ యుక్తవయస్సులో (దేశంలో ఓట్లు, ఎన్నికలు 1951లో మొదలయినాయి. అంటే భారత రిపబ్లిక్ అనే బిడ్డ వయస్సు ఈ పాట రాసే కాలానికి 20- 21 సంవత్సరాలు) చేయవలసిన పెండ్లి చేయలేకపోయాడు. తీర్చవలసిన అచ్చుట్లు-ముచ్చట్లు తీర్చలేకపోయాడు. కారణం తాను ఉత్పత్తి చేసిన సంపదను పాలకవర్గాలు దక్కించుకొనగా తాను బీదరికంలో

ప్రగ్గటమే. ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటం గతితార్కిక చారిత్రక అవసరం. అందుకు కావలసిన చైతన్యాన్ని శ్రమజీవి తన బతుకులోంచి, శ్రమశక్తిలోంచే పొందగలడు. పోరాటంలో అతని శ్రమశక్తి సాధనాలే ఆయుధాలవుతాయి. కాబట్టే చెరబండరాజు శ్రమజీవిని

కర్రు పార సాన- బెట్టన్నా
బతుకు యుద్ధములోన - నిలువన్నా
అని పిలుస్తాడు.

ఈ పాటల్లో కొన్ని తెలుగుదేశంలో శ్రమజీవుల చైతన్యంతో బాగా పెనవేసుకొన్నాయి. 'కొండలు పగలేసినం', 'జన్మహక్కు', 'విప్లవాల యుగం మనది' మొదలగు పాటలు విప్లవ యువత ఊపిరిలో భాగంగా స్పందిస్తున్నాయి.

కుట్రకేసుల్లో ఇరికించబడ్డా, ఉన్న చిన్న జీవనాధారం ఊడినా, ఈ వ్యవస్థ కాన్సరై శ్రమజీవి, కవి అయిన తనను ఉన్న పళంగా తినేస్తున్నా ఖాతరు చెయ్యక శ్రమజీవుల పక్షాన మొక్కవోని కత్తిలా జీవించి, కత్తిపాట పాడుతూనే విప్లవ చైతన్యంతో సంపూర్ణ ఐక్యతను సాధించాడు చెరబండరాజు.
కవిత్వంలోనే కాదు, తన బతుకులోనూ గతితార్కిక చైతన్యంతో జీవించి కవిత్వానికీ, మానవ జీవితానికీ ఉన్నత ప్రమాణాలు నెలకొల్పినవాడు చెరబండరాజు.

## నెత్తుటి కళ్ళలో ఎత్తిన జెండా - శ్యామల

చెర గురించి నన్ను రెండు మాటలు మాట్లాడమన్నారు. ఏం మాట్లాడను. మాట్లాడాలంటే చాలా భయంగా ఉంది. బాధగా ఉంది. ఆయన రాసిన కవిత్వం, పాటలు చాలా సహజంగా, అందరికీ అర్థమయ్యే రీతిలో, ముఖ్యంగా కష్టజీవుల గురించి, కార్మికుల గురించి రాసేవాడు. తాను ఎప్పుడూ పేదవాళ్ళ గురించి ఆలోచిస్తూ ఉండేవాడు. ఇంట్లో ఉన్నా, బయట వున్నా, బస్సులో వున్నా, సైకిలు మీదున్నా, ఎక్కడ వున్నా కూడ ఆయనకు అదే ఆలోచన. అట్లా ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఒకసారి లారీ యాక్సిడెంట్ అయింది.

ఆయన రాసిన మాటలు, పాటలు మనందరినీ కదిలిస్తాయి. అట్లాగే ఒక పాట, ‘‘ఇంటింట చీకటే రపతి కంట కన్నీరె రాజ్యమెవరికి వచ్చెనో, సుఖము లెవరికి దక్కెనో...'' అనే ఈ పాట పేదవాళ్ళ కన్నీళ్ళ గురించి, ఇంటింట ఉండే చీకటి గురించి రాశారాయన. మరి ఇంటింటిక చీకటిని తొలగించాలంటే మనమంతా కృషి చేయాలి. మన ఇంట్లో దీపం మనమే వెలిగించుకోవాలి. దానికి మనం పాటుపడాలి. యదార్థంగా చెర నడిచిన బాటలో మనమంతా నడుస్తాం. పేదవాళ్ళ గురించి, పేదవాళ్ళ కష్టాల గురించి ఆయన బాటలో నడుస్తూ మునుముందుకే పోతామని ఆశిస్తాను.

చెర సంవత్సరకాలం హాస్పిటల్‌లో వుండి నానా అవస్థలు పడ్డాడు. అదీ మాటల్లో చెప్పలేను నేను. పెద్దవాళ్ళంటారే, ‘పిట్టఘోష అనుభవించాడు,’ అని. పిట్టఘోష అంటే ఎలా ఉంటుందో మనకు తెలియదు గాని, నేను మాత్రం కళ్ళారా చూశాను. చాలా బాధతో నెట్టుకొచ్చాడు సంవత్సరం పాటు. అయినా ఏరోజుకా రోజు చెర మాట్లాడుతాడు, చెర నన్ను పిలుస్తాడు అని ఆశించేదాన్ని. కాని ఏరోజుకారోజు తాను దిగజారిపోతూ ఏమీ చెప్పకుండా, మాట్లాడలేకుండా, మాట చెప్పలేకుండా కళ్ళల్లోంచి నీళ్ళు కారేవి. కొంతకాలం తరువాత నీళ్ళు కారి కారి కళ్ళలోంచి చీము రక్తం కారటం మొదలయింది. తను ఎప్పుడయితే ఎర్రజెండా కోసం పోరాడాడో ఆ ఎరుపే కళ్ళలోకి రావటం మొదలయింది. తను ఏమీ చేయలేని స్థితిలో ఉండి కూడా కళ్ళల్లో తన నెత్తురిని చూపించాడు. అంటే ఆ ఎరుపు బాటలో నడవండి... ఆ ఎర్రజెండాను ఎగరేయండి. నా శక్తి వున్నంత వరకు నేను చేశాను. ఆ తరువాత మీరే...'' అని మనసులో ఉందన్న మాట.

ఇన్ డైరెక్టుగా చెరబండరాజుని ఈ ప్రభుత్వం హత్య చేసింది. జబ్బు కొంచెమే ఉన్నా చాలామటుకు ఆలోచనలతో, చదువుతో, తలనొప్పితో, ఈ దోపిడీ ప్రభుత్వం, ఈ కుష్టువ్యవస్థ మా చెరను చంపింది కాబట్టి, మా చెరను హాస్పిటల్లో ముక్కలు ముక్కలుగా కోశారు కాబట్టి, మనమంతా కలిసి ఈ ప్రభుత్వాన్ని ముక్కలు ముక్కలుగా కోసి ఆయన ఆశయాల కోసం మనమంతా పోరాడుదామని మనమంతా ఐక్యంగా

ఉంటామని... మీ అందరిలో నా చెరను చూసుకుంటాను. మన చెర రాసిన పాటలు పాడుకుందాం... ఆయన పాటలతో పాడుదాం. ఆయన ఆటలతో ఆడుదాం.

నా చెర, మన చెర ఎప్పుడు మనతోనే ఉంటాడు. మనల్ని వెన్నంటే ఉంటాడు. మనల్ని తడుపుతూనే ఉంటాడు. అది మాత్రం మరచిపోగూడదు.

మా పిల్లలిద్దరూ చాలా చిన్నవాళ్ళు. మా పాప పదేళ్ళుంటుంది. మా బాబుకి ఐదేళ్ళుంటాయి. పిల్లలంటే చెరకు పంచప్రాణాలు. చాలాకాలం దాకా పిల్లలు కలుగలేదు మాకు. కలిగిన తరువాత వాళ్ళ ముద్దుముచ్చట ఏమీ చూసుకోకుండా, ఆడకుండా, పాడకుండా వెళ్ళిపోయాడు.

ఈరోజు ఉదయం, 'నాన్న మీటింగు జరుగుతోందిరా, అక్కడి కెళ్దాం,' అన్నాను బాబుతో. అప్పుడు, 'నాన్న అక్కడికి వస్తాడా అమ్మా,' అని అడిగాడు. ఏం సమాధానం చెప్పాలి. వస్తాడని చెప్పనా, రాడని చెప్పనా. ఏమీ చెప్పలేకపోయాను. కష్టజీవుల గురించి, కార్మికుల గురించి, కన్నీళ్ళ గురించి కొండలు పగలేసినం పాట తను రాశాడు. ఆంధ్రదేశం అంతటా ఆ పాట పాడుకొంటున్నారు. అట్లాగే మా పాప ఆ పాటకు, వాళ్ళ నాన్న రాసిన పాటకు డాన్స్ చేస్తుంది. చూడండి- నేను ఇంతకంటే ఎక్కువ ఏమీ చెప్పలేను.

( జంటనగరాల రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు జులై 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన చెర ప్రథమవర్ధంతి సభలలో బహిరంగసభకు అధ్యక్షత వహిస్తూ చేసిన ప్రసంగం. )

ఈనాడు మనుషులకు ఎదురవుతున్న సమస్యల మూలాలు చరిత్ర మొదలవని దశల్లోనే కనబడతాయి. వీటికి ముఖ్య కారణాలు సామాజికమే అయినప్పటికీ కొన్ని జీవశాస్త్రపరంగా కూడా పరిగణించదగ్గవి. మానవ ప్రవృత్తిని అర్థం చేసుకోవడానికి డార్విన్ ప్రతిపాదించిన పరిణామవాదం బాగా పనికొస్తుంది. ఒకటిన్నర శతాబ్దం కిందటి ఈ ప్రతిపాదనలకు ఆధునిక యుగంలో జన్యు విశ్లేషణ ద్వారా రుజువులు లభిస్తున్నాయి.

ఈ వివరాలను స్థూలంగానైనా తెలుసుకుంటే ప్రకృతిలో మనిషి ఉనికిని గురించిన సరైన అవగాహన కలుగుతుంది. తక్కిన ప్రాణుల మధ్యలో వాటి సరసనే కొన్ని పరిస్థితుల్లో తలెత్తిన మానవజాతి పరిణామం ఎలా జరిగిందో తెలిస్తే మనుషుల సహజలక్షణాలుగా పేర్కొనబడుతున్నవన్నీ ఎప్పుడు, ఎలా, ఎందుకు ఏర్పడ్డాయో కొంతవరకైనా అర్థమవుతుంది. ఆ దిశగా చేస్తున్న చిన్న ప్రయత్నమే ఈ వ్యాసాల సమర్పణ.

ప్రాణులన్నీ ఒకే కుదుటినుంచి పుట్టాయని మనకు తెలుసు. వీటిలో మనను ఏమాత్రమూ పోలనివీ, మనతో కొంత పోల్చదగినవీ, మనకు దగ్గర బంధువులనిపించే వానరాలూ ఇలా అనేకం ఉన్నాయి. జంతువులతో పోలిస్తే మనిషికి ప్రత్యేకత కలిగించే లక్షణాలు చాలానే ఉన్నాయి. మేధాశక్తిలోనూ, సాంఘిక పరిణామంలోనూ జంతువుల్లో మనిషికి సాటి రాగలిగినవి లేవు. జీవపరిణామ క్రమంలో మనిషికి అబ్బిన ప్రత్యేకతలన్నీ దాదాపు ఒకేసారి రూపొందాయి. చిత్రమేమిటంటే వీటన్నిటికీ పరస్పర సంబంధాలున్నాయి. ముందు కాళ్ళు చేతులుగా మారడంతో వాటికి కొత్త నైపుణ్యం అలవడింది. నడవడం, పరిగెత్తడం, నడక నుంచి విముక్తి పొందిన చేతులతో ఆయుధాల తయారీ ఇవన్నీ కూడా అపూర్వమైన పరిణామాలకు దారితీశాయి. చెట్లను అంటిపెట్టుకుని తప్ప జీవించలేని వాలిడి కోతులూ, నరవానరాలలాగ కాకుండా మనుషులు ఆహారానికై జంతువుల మందలను వెంబడిస్తూ వివిధ ప్రాంతాలకు కాలినడకన వెళ్ళగలిగారు. ఈ ప్రయాణాలు తొలి మానవులను రకరకాల వాతావరణానికీ, నైసర్గిక పరిస్థితులకూ గురిచేసి, వారి సామర్థ్యాన్ని పెంచాయి. ఇదంతా క్రమంగా వారి మెదడు నిర్మాణంలో అభివృద్ధికి దారితీసింది. మొదట్లో క్రూరమృగాలు చంపిన కళేబరాలను పీక్కు తినటానికి పనికొచ్చిన రాతి పనిముట్లు క్రమంగా ఆయుధాలుగా మారసాగాయి. వాటి తయారీ వల్ల చేతులకు పనిపెరిగిన కొద్దీ మెదడు వికాసం కూడా జరగసాగింది. చేతులూ,వేళ్ళ కదలికలను శాసించే మెదడులోని భాగాలు విపరీతంగా అభివృద్ధి చెందాయి. తత్ఫలితంగా రెండు కాళ్ళ మీద నడవగలగడం, పనిముట్లు చేసుకోవడం, ముందాలోచనతో వ్యవహరించడం మొదలైన విశేష శక్తులన్నీ కలిసి ఏర్పడ్డాయి. దీనివల్ల కొన్ని అనుకోని మార్పులు జరిగాయి.

దీనికి పూర్వరంగం ఎటువంటిది? మనిషి ఆవిర్భావం జరగడమే యాదృచ్ఛికం. లక్షలాది సంవత్సరాల క్రితం భౌగోళిక పరిస్థితుల్లో కలిగిన మార్పులవల్ల

నాలుగు కాళ్ళతో పరిగెత్తే నరవానరజాతుల్లో కొన్నిటికి రెండుకాళ్ళ నడక తప్పనిసరి అయింది. మరే ప్రాణికీ లేని విధంగా పనులు చేసుకోవడానికి చేతులనేవి ఏర్పడ్డాయి. పనిముట్లద్వారా ఆహారం మరింత బాగా సంపాదించుకోవడంతో రానురాను సున్నితమైన పనులకు చేతులు అలవాటు పడడం, దానికి అనుగుణంగా మెదడు పెరగడం జరిగింది.

తక్కిన తేడాలన్నీ అంచెలంచెలుగా ఒకదాన్నుంచి ఒకటిగా రూపొందసాగాయి. అడవుల్లో జీవిస్తూ అందుబాటులో లభిస్తున్న ఆహారంతో సరిపెట్టుకునే పరిస్థితులు మారిపోయాయి. ఎప్పటికప్పుడు కొత్త ప్రదేశాలకు ప్రయాణించిన తొలి మానవులకు తిండి ఒక సమస్య కాసాగింది. జంతువుల మందలను వెంబడించి వేటాడడం మొదలైంది. ఏరుకుతినే దశనుంచి వేటాడే దశకు చేరుకోవడంతో ముందుగా ఆలోచించుకోవడం అవసరమయింది.. దీనికి తగినట్టే మెదడు విపరీతంగా పెరిగింది. అందువల్ల మనిషి తల పెద్దదయింది. వానరాల్లా కాకుండా నిటారుగా నిలబడ్డ మనిషికి ముఖం అంతకంతకూ విశాలమవుతున్న మెదడుకు కింది భాగాన అమరింది. భౌతిక పరిస్థితులు శాసించిన మార్పులు మనుషుల శరీరాల్లో క్రమంగా మరెన్నో పరిణామాలు కలిగించాయి.

వన్యప్రాణుల్లో ఒకటిగా పెరిగిన మానవజాతికి క్రమంగా ప్రత్యేక లక్షణాలు కలగసాగాయి. జంతువుల పిల్లలు పుట్టీ పుట్టగానే నేల మీద పడి చకచకా నడవడం, తల్లివెంట పరిగెత్తడం చేస్తాయి. అందులో ''పురుటినొప్పులు'' కూడా ఉండవు. పిల్లలు త్వరగా పెద్దవై యుక్తవయసుకు వచ్చేస్తాయి. జీవనశైలిలో మార్పులను సాధించిన మనుషుల్లో మటుకు అలా జరగదు. మనుషుల పిల్లలు నిస్సహాయులై పుట్టడమే కాదు, తమ జీవితకాలంలో నాలుగోవంతు పెరుగుదలలోనే గడుపుతారు. ఈ సుదీర్ఘవ్యవధిలో వారి మెదడు అంతులేని అభివృద్ధి సాధిస్తుంది.

తక్కిన వానరజాతి జంతువులతో పోలిస్తే మనుష్యులు పుట్టే పద్ధతి చాలా విషయాల్లో ప్రత్యేకమనే చెప్పాలి. ప్రసూతి సమయంలో స్త్రీలు అసహాయతకు లోనైనంతగా మరే వానరజాతి ప్రాణి విషయంలోనూ జరగదు. మనిషి సామాజిక జీవితానికీ, రెండుకాళ్ళ నడకకూ దీనితో సంబంధం ఉందని కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. జంతువుల్లాగ కాకుండా మరొక మనిషి మంత్రసానిగా సాయం చెయ్యవలసిరావడం సామాజిక అంశమే. డార్విన్ సిద్ధాంతం ప్రకారం చూస్తే ప్రసూతిలో ఇతరుల సహాయం పొందిన తల్లులు పొందనివారికన్నా బాగా మనగలిగారన్నమాట. వానరాల్లా సహజమైన పద్ధతి అవలంబించిన స్త్రీలలో మరణం ఎక్కువగా సంభవించి ఉండాలి. అందువల్ల ఆ శరీర లక్షణాలు అంతరించిపోయాయి.

రెండుకాళ్ళ నడక కారణంగా మనుష్యుల కటి భాగపు వెడల్పు తక్కిన వానరజాతి జంతువులకన్నా తక్కువగా ఉంటుంది. యోనిమార్గం ఇరుకవడం వల్ల పిల్లలు పుట్టడం కష్టమవుతుంది. తల్లికి బాధ కూడా ఎక్కువౌతుంది. మనిషి మెదడు పరిమాణం పుట్టినప్పటితో పోలిస్తే పెద్దయాక మూడింతలు పెరుగుతుంది. కోతుల్లో ఇది రెండింతలే. ఈ పెరుగుదల గర్భంలో ఉన్నప్పుడే సజావుగా జరగాలంటే తల్లి బిడ్డను 21 నెలలు మొయ్యాలి. అలా జరిగితే పుట్టే నాటికి శిశువు తల విపరీతంగా పెరిగిపోయి బిడ్డ బైటకు రావడం అసాధ్యమౌతుంది. నెలలు నిండడం చింపాంజీల్లో

మనిషిలాగే జరుగుతుంది కాని శిశువు మెదడులో మనిషికన్నా చాలా ఎదుగుదల కనిపిస్తుంది. పుట్టినప్పుడు కోతి పిల్లలు మనుష్యులంత నిస్సహాయంగా ఉండవు.

మనిషికి జీవపరిణామం మందగించి సాంఘికజీవితం మొదలవడంతో దానికి అనుగుణంగా శరీరంలో, ముఖ్యంగా మెదడులోనూ, ఇతర లక్షణాల్లోనూ మార్పులు అనివార్యం అయాయి. నోటి నిర్మాణంలోనూ, నాలుక కండరాల్లోనూ జరిగిన అభివృద్ధి మాట్లాడడనికీ, భాష పెరుగుదలకూ దోహదం చేసింది. చిన్న చిన్న తెగలుగా సమాజజీవితం ప్రారంభించిన ఆదిమమానవులకు భాషా, తద్వారా ఇతరులతో సంపర్కమూ కలిగించిన లాభాలు ఇంతా అంతా కాదు.

మనిషి వ్యవసాయం మొదలుపెట్టి, స్థిరనివాసాల్లో జీవించడంతో తినే ఆహారంలో వైవిధ్యం పెరిగింది. కార్బోహైడ్రేట్ల రూపంలో అనేక ధాన్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్యం మెరుగుపడింది. పిల్లలకు పాలు మాన్పి ఇతర ఆహారం అలవాటు చెయ్యడం వీలయింది. తల్లులు మంచి పోషక ఆహారం తినడంవల్ల పది, పదిహేను నెలలలో మళి కాన్పుకు సిద్ధం అవసాగారు. ప్రకృతి వైపరీత్యాలకు గురికాకుండా మనుషులు తమను తాము కాపాడుకోగలిగారు. పుట్టినప్పుడు బలహీనంగా ఉన్నప్పటికీ మనుషులు ఒకరికొకరు తోడ్పడే సమాజ జీవితం ద్వారాఇతర ప్రాణులకన్నా అభివృద్ధి సాధించగలిగారు.

ఈ పరిణామాలవల్ల ఏమౌతుంది? మనుష్యుల తలలు పుట్టినప్పుడు అంతకంతకూ పెద్దవౌతాయి. సహజ ప్రసూతిలో శిశువు తల నొక్కుకుపోయి భరించరాని బాధ కలుగుతుంది. మునుపటి కన్నా ఈ రోజుల్లో సిజేరియన్ పద్ధతిలో పిల్లలు పుట్టడం ఎక్కువైంది. శస్త్రచికిత్సలో జరిగిన అభివృద్ధి దీనికి కొంత కారణం కావచ్చు కాని పిల్లల తలలు అంతకంతకూ పెద్దవి కావడం కూడా ఇందుకు కారణమేమో. ఈనాటి పోటీ ప్రపంచంలో తెలివితేటలు లేకుండా పెరగడం అసంభవం కనక ఇది ప్రకృతిలో జరిగిన ఏర్పాటేమో.

పిల్లలు పుట్టి పెరగడానికీ, మనుషులు సమాజాలుగా ఏర్పడడానికీ కూడా గట్టి సంబంధం ఉందని కొందరు శాస్త్రవేత్తలంటారు. సమష్టిగా పెంచిన పిల్లలు బతికి బట్టకట్టే అవకాశం ఎక్కువ. అందరు ఆడవాళ్ళకూ కాన్పు ఒకేసారి రాదు గనక సాటివారికి తోడ్పడడం, ఒకరినుంచి మరొకరు నేర్చుకుని పిల్లల్నికాపాడడం వీలవుతుంది. ఐకమత్యమే మహాబలంగా పెరిగిన ఆదిమానవుల తెగలకు పిల్లల పెంపకంలోని ప్రాముఖ్యత అర్థమై ఉంటుంది. ఇవన్నీ ఆధునిక శారీరక లక్షణాలు బలపడడానికి దోహదం చేసి ఉండాలి.

ఈ రోజుల్లో మనుష్యుల ఆరోగ్యం బాగా మెరుగుపడింది. టెస్ట్‌ట్యూబుల్లో శిశువులు రూపొందే రోజులొచ్చాయి. మనిషి శరీరనిర్మాణం మాత్రం ఆనాటి ప్రత్యేక పరిస్థితుల్లో రూపుదిద్దుకుందనేది మరిచిపోరాదు. ఆయుర్వేదంలోనూ, ఇతర ప్రకృతివైద్యాల్లోనూ అసహజ జీవనవిధానాన్ని గురించి విమర్శిస్తూ గొంతు చించుకునేది అందుకే.

## నీ మృత్యువుతో - సర్వేశ్వర్ దయాల్ సక్సేనా

నీ మృత్యువుతో
ఈ వర్షం లావాయై పొరలింది
చైతన్య దిక్కుల నుంచి
గంధకధూమం ఎగిసింది

నలుదిక్కులా
ఉక్కును ముక్కలు చేసిన వాసన కమ్మింది
కనిపించనివి ఏవి మసకమసక విధ్వంసన దృశ్యాలో
జైలు కటకటాలా
సంకెళ్లా
మనస్సు నావరించిన భీరత్వపు గొలుసులా
నోటికీ, కలానికీ పడ్డ తాళాలా
లేదా అన్నీ ఒక్కసారేనానాకో చీకటికొట్టు కనిపిస్తున్నది
దాని ఉక్కగోడల మీద
బొట్లు బొట్లుగా కారిన నీ నెత్తురు చేసిన రంధ్రాలనుంచి
కిలకిలలాడే పక్షుల స్వేచ్ఛా తరంగాల్లో పుష్పిస్తున్న
సమస్త ఆకాశం తొంగిచూస్తున్నది

ఒక విప్లవకారుని మరణంలో
ఎందరు మృతులు సజీవులవుతారో
ఎవరికి తెలుసు
అచేతన సమాజం లేచినిలుస్తుంది
అతని నరాల్లో నెత్తురాగితే
కోట్లాది రక్తనాళాల్లో ఆగిన నెత్తురూ ప్రవాహమౌతుంది

నా ముందు ఊగుతూ విస్తరిస్తున్న పొలాలు
నిప్పులు చిమ్ముతూ నింగికెగుస్తున్న మొహాలు
విప్పారుతూ పొంగిపోతున్న గుండెలు

నాకు తూటాలశబ్దం వినవస్తున్నది
చెయ్యి విసిరి చిన్న పురుగును పట్టుకున్నట్లు

ఆ శబ్దాన్ని కమ్మేసిన గర్జనకూడ వినవస్తున్నది

నేను నిన్ను చూడలేదు
ఎడదల్లో ఎడారులు
ఆలోచనల్లో అరణ్యాలు
కడుపులో ఆకలి పర్వతాలు
కళ్లల్లో నదులు
శ్వాసల్లో తుఫానులు
స్వరంలో బంధించబడ్డ పొలికేకలు
చేతివ్రేళ్లపై
ఆటవిక మృగాల పంజాదెబ్బల గుర్తులు
పాదాలు రేపుతున్న ధూళిలో
బీళ్లైన ఊళ్ల దు:ఖాల మధ్యవెక్కిళ్లు
వేస్తున్న ప్రతి అడుగునూ
తోసేస్తున్న అన్యాయ సముద్రాల మీంచి వీచేతేమగాలి
ఉన్న ఆ ఆవాసాలలో
నేను నీ వెంట తిరుగలేదు
నువ్వు కాగడా అందుకొని సాగిపోయినబాట
మనసు చీకట్లను కాంతిపుంజాలతో నింపినచోట

విప్లవకారుడు మరణించినపుడు
మూగచరిత్రకు మాటలు వస్తాయి
భూగోళం ఒక్కచోటికి ఒదుగుతుంది
ప్రకృతి అతడు రాసిన గీతాలనాలపిస్తుంది
ప్రతి గుండెమీంచి బరువుబండలు తొలగిపోతాయి

నువ్వు మరణించిన తర్వాత
నువ్వు నాతో మాట్లాడుతున్నట్లు
నా దగ్గరకూర్చున్నట్లు అనిపిస్తున్నది

ముందర మంటలమీద కాపిన
విశాలమైన డప్పు ఒకటి ఉన్నది
లెక్కలేనన్ని చేతులు దానిని మోగిస్తున్నాయి

స్వేచ్ఛాగీతాలు అలపిస్తున్నాయి
నాకాభాష తెలియదు
కాని ఆ సందేశాన్ని
ఈ వర్షంలో గొడుగులా పట్టుకుంటాను

విప్లవకారుడు మరణించినపుడు
భాషాగోడలు కూలిపోతాయి
జాతి, ప్రాంతం, రాష్ట్రం
సరిహద్దులు చెరిగిపోతాయి

తిరుగుబాటు ఇష్టమైన పక్షిలా
భుజాలమీద కూర్చోపెట్టుకొని
నేను నీవెంట
లేచినడుస్తూ ఉంటాను
నినాదాలను క్రియలుగా మారుస్తూ
ఈ వర్షం
నీ మృత్యువుతో లావాయై పొరలింది
మరిమేము, ఉక్కుగా మారాము.
బంధనాలు విరిగిపోతున్నాయి
తొందర్లోనే ఈ గంధకధూమం
నీలలహరిలో ఒళ్లువిరుచుకునే
అగ్నిశిఖలుగా మారిపోతుంది
బానిస సంస్కృతి దగ్ధమవుతుంటే
వెలువడే ఒక వాసన
ఈ నేలంతా వ్యాపిస్తుంది

విప్లవకారుడు మరణించినపుడు
నిరీక్షించే అవధి
దగ్గరపడుతుంది

నీ మృత్యువుతో
ఆ ఆవాసంలో తేజస్సు
మరింత దగ్గరగా కనిపిస్తున్నది

చెర బండ రాజుకుంటున్నది
(అది నీపేరు)
పాకుతూ పాకుతూ
భూమిని సమతలం చేసి కానీ అది ఆగదు
లక్షల చితిమంటల్లోంచి
ఎగసిన శ్వేతాగ్నివలె
శతాబ్దాలదాకా జ్వలిస్తూ నువుచూస్తూ ఉంటావు.
మా అందరినీ
మా చేతుల్లో
నువ్వు అందించిపోయిన
ఈ విప్లవ కేతనాన్నీ.

సౌజన్యం:
సృజన సాహిత్య పత్రిక

## ప్రపంచం నిండా ....

- చెరబండరాజు

ఆకాశం కింద విశాల హృదయంతో
వస్త్ర హీన దేహాలతో
మండే కడుపులతో
రక్తాన్ని ఇంధనంగా మార్చి
పాలకుల రైలు ఇంజన్ని ఊడ్చుకుపోతున్న
కార్మికులం కర్షకులం నిరుపేదలం మనమే

స్నేహానికీ ప్రేమకూ చేతులందిస్తే
రోగాలూ నొప్పులూ ఆప్తులతో గోడుగోడునా చెప్పుకుంటే
మనిషికి మనిషిగా తోడు నీడా అంటే
పోరాటం మినహా బతుకూ భవిష్యత్తూ అసలే లేదంటే
కంఠాల నిండా ఇనపముళ్ళు కుక్కే చట్టం
కంటి రెప్ప లెత్తితే కాల్చేస్తామంటోంది

కడలి తప్ప కన్నీటిని బోధపర్చుకునే దెవరు
కడుపు బాధలకు నేల తప్ప
కరుణా ప్రేమలతో చెవియొగ్గే దెవరు

ప్రపంచం నిండా మన చేతుల్లో
ఆకలి ఆక్రందన లెత్తించిన పతాకాలు
ఒకే లక్ష్యసాధనకై
ఒకే ధర్మసాధనకై
మానవతా సంకేతాలై
మంటల్లో పడిలేచీ
వానల్లో నాని ఎండి
తుపానుల్ని అడ్డుకొనీ
భూగోళం గుండెపైన
అవిగవిగో అవిగవిగో అనవరతం ఎగిరేను
మరికొంచెం మరికొంచెం మరికొంచెం
సరిహద్దులు అధిగమించి
శ్రామిక రాజ్య సందేశాన్ని వినిపిస్తున్నాయ్

మనం హరిజనులం గిరిజనులం
అనాగరికులం అడవి మనుషులం
నీగ్రోలం బానిసలం

కాయకష్టంచేసి కనాకష్టంగా బతికే వాళ్ళం
అన్నానికీ ఆనందానికీ
కౌటుంబిక అనుబంధానికీ
సభ్యతకూ సంఘంలో
సమానత్వ హక్కులకూ
అనర్- హులం భయస్థులం
నోరులేని జీవులం

జైళ్ళూ కోర్టులు చట్టాలూ సంకెళ్ళూ పోలీసుల బయనెట్లు
అవునవునూ
మన శాంతికి మన భావికి
మన జీవిత సౌఖ్యానికి
అర్ధరాత్రి రేడియో విప్పండి
ఏ ఉదయమైనా వార్తాపత్రిక తిప్పండి

పొలాల్లో అడవుల్లో
ఫ్యాక్టరీల సమ్మెల్లో
చంపబడ్డ రాక్షసులం
రాజద్రోహులం హంతకులం
ఉరికంబం ఎక్కే వాళ్ళం అంతా మనమే
అరో పరకో అటో యిటో
మన నేరాలన్నీ ఒకే సెక్షను కింది కొస్తాయి
అందుకే
దారి తప్పిన సోదరులందరిదీ ఒకేదారి

## కత్తిపాట - చెరబండరాజు

మృత్యువునే
పరిహసిస్తు
శత్రువునూ
ఎదిరిస్తా

బాహాబాహి
యుద్ధంలో
ప్రజాబలం
నిరూపిస్తా

పాలకులా
ప్రతిపక్షుల
ఉభయవర్గ
శత్రువునే

సమీకృత
సాయుధవ్యవస్థను
ప్రజాయుద్ధమే
జయించు

ప్రతిపక్షం
సీటుగాదు
రాజ్యాంగం
వలయునాకు

అనారోగ్య
బాధితుణ్ణే
అయితేనేం
యోధుణ్ణే

కలంగళం

ప్రాణప్రదం
ప్రజకి నేను
అంకితం

పోరాటం
డైరెక్షన్
పాట నాకు
ఆక్సిజన్

కన్నీటికి
కరుగుతాను
ఏటివాలు
పడిపోను

ముంజేతిని
ఖండించిన
నా పిడికిటి
కత్తివదల

ఉరి తాటికి
పాట నేర్పి
పల్లవిసే
పాడిస్తా

ప్రజలు వేలు
మృతులైనా
పోరాటం
జయిస్తుంది

రేపటిపై
ఆశలున్న

వాడేనోయ్

మానవుడు

ఈ చీకటి

కుంపటారి

ప్రభాతాలు

పరిమళించు

## రైట్ టు ఓట్ కాదు - లోచన్

కోట్ల అస్థిపంజరాలమీద మస్తీగా కొందరు
రక్తపు గిలాస లెగరేస్తూ
ఆకలి సముద్రంలో మమ్మల్ని తన్నేస్తూ –
ఆకాశాని కెత్తిన పెట్టుబడి- వేయిపగడలు
మా బతుకుల్లో విషం కక్కుతుంటే
మూడు కోతులూ బోడినవ్వులూ జాతిని నిర్వీర్యం చేసేస్తే
ఇంకా వ్యక్తి స్వేచ్ఛ అనే పెర్రి భ్రమలో
వర్గసామరస్యం పన్నిన వలలో
గిలగిలా తన్నుకోలేను

భాక్రానంగల్లూ నాగార్జునసాగర్లూ
'గొప్పోళ్ళ' షవర్ బాత్ రూముల్లో ఊడిగాలు చేస్తోంటే
ఈ జాతీయ వంచకుల బద్మాష్ డ్రామాలో
ఫూల్ గా నటించలేను

ఈ కొండమంగలి వెధవల చేతుల్లో నిస్సహాయంగా తల ఉంచలేను
ఇరవైమూడేళ్ళ భయానక చరిత్ర రాష్ డ్రైవింగ్ లో జాతి మెదడుకి
ఎన్నెన్ని లోతైన సెప్టిక్ గాయాలు
దారిపొడుగునా ఎన్నెన్ని దారుణ దృశ్యాలు

నా చెల్లెళ్ళ దేహాలనిండా పిచ్చికుక్కల కాట్లు
నా పిల్లల అమాయకపు చూపుల్లో కత్తిపోట్లు

ఉష్ ! భరించలేను
గుండెలో మంట
నరాల తెగింపు

ఇవాళ నాకసి వెలిగించిన నెత్తురుమంటల్లో నిలబడి చెపుతున్నా
మెలితిరిగే కడుపులో ఆకలి మాట అంటున్నా
రైట్ టు ఓట్ కాదు
ఈ దోపిడి రేచుకుక్కల్ని తరిమి తరిమి
ఫైట్ టు ది లాస్ట్

## అతనికేం కావాలి? - రామా చంద్రమౌళి

ఒక పేరు కోసం, ఒక ఉనికి కోసమేకదా
ఎవరైనా, ఏదైనా చేస్తున్నది
అతనికసలు పేరేలేదు
అన్నీ 'అలియాస్' లే -
ఆ రోజు అన్నింటినీ పరిత్యజించి, అందరినీ త్యాగించి
గమ్యం తెలియని గౌతమునివలె కాక
స్పష్టమైన 'లక్ష్యం' తోనే అడవిలోకి అంతర్ధానమైనవాడు –

గాజుపెంకుల దారిలోనే బోసిపాదాలతో నడవాలని నిర్ధారించుకుని
రాతిపాదాలను సమకూర్చుకున్నవాడు
ఏ పశువులకొట్టంలో పడుకున్నాడో
ఏ పొదలమాటున పిడికెడు తిన్నాడో
పుస్తకాలను నమ్మి, పాటలను నమ్మి
బిగించిన పిడికిళ్ళను నమ్మి
గర్జనలను నమ్మి … ఒక అదృశ్య సైనికుడై
తనకంటూ ఓ జీవితం లేకుండా
బతుకంతా ఒక రహస్యమే ఐనవాడు
భూమికి చెవి ఆనించి మనిషి గుండెచప్పుడు వినేవాడు
రేపు జన్మించబోయే శిశువుకోసం
ఒక్కసారి సెంట్రీయై, ఒక్కసారి కొరియరై
ఒకసారి నిప్పులురిమే తుపాకీ తుటాయీ
ఒకసారి నేలకొరిగే అగ్నికెరటమై
తప్పకుండా తనకు చావు తప్పదని తెలిసీ
జ్వలించే ఒక చేతనగా
చేతిలో తుపాకితో ఆ అడవి గుండెలపై అజేయుడై నిలబడ్డ
ఏదీ అవసరంలేని అతనికి
ఏంకావాలని నువ్వనుకుంటున్నావు?

మాట్లాడుకోవాలి - డా. బి.వి.ఆర్. ప్రసాదమూర్తి

మాట్లాడుకోవాలి

మెత్తగా బత్తాయి పండు తొనలువిప్పినట్టు
మనసువిప్పి మాట్లాడుకోవాలి

గుండెలోపలికి చేతులుపెట్టి బయటకుతీసిన మాటల్ని
షవర్ బాత్ చేయించి
ఫ్రెష్గా ఎదుటివాళ్ళముందుంచాలి

మాటలేకదా
అమ్మ నాన్న గురువు సంఘం
వీళ్ళంతా నీళ్ళుపోసి పెంచిన మాటలేకదా
అంతా చేయిపట్టుకునిలబెట్టిన మాటలే కదా

మాట్లాడితే
అందరికీ కృతజ్ఞతతో అభివాదం చేస్తున్నట్టుండాలి
అప్పుడే స్నానమాడిన రెండు తడిదేహాలు
తమకంగా కౌగిలించుకున్నట్టుండాలి

మాట్లాడితే
శుభ్రంగా మంచుకడిగిన నిలువెత్తు అరిటాకు మీద
ఆత్మీయులకోసం నిన్ను నువ్వు వొడ్డించుకున్నట్టుండాలి

మాటకు బొమ్మేకాని బొరుసులేదు
మాటకు వెలుగేకాని చీకటిలేదు

మనుషుల్లా మాట్లాడుకోవాలి
అందరిముందు నిన్ను నువ్వు గుమ్మరించేసుకొని
శున్యంగా చిద్విలాసించాలి
తొదుగుల్లేని మాటల్ని జేబుల్నినింపుకొని
గృహదేహాల నుండి బయటపడాలి

ఇంట్లోనైనా వీధిలోనైనా
ఆఫీసులోనైనా పార్లమెంటులోనైనా
ప్రేమకోసం స్నేహంకోసం
శాంతికోసం మాట్లాడుకోవాలి
పంజరంలోనుండి పక్షిని వదిలివేసినట్టుండాలి

కొళాయితిప్పితే
నీ నుండి ఏమీ ఆసించని ఓ చిట్టిపాప
చటుక్కున నీ బుగ్గని ముద్దుపెట్టున్నట్టుండాలి

మాటలే కదా
మాటలంటే మనుషుల మనసులేకదా
దయచేసి
మాటని మర్కెట్ మేయొద్దు.

(11.6.2007న ఆవిష్కరింపబడిన మాట్లాడుకోవాలి సంకలనం నుంచి)

## సామాజిక న్యాయం వైపు - సురేష్ కుమార్ దిగుమర్తి

నేను నిశ్శబ్దాన్ని
మౌనంగా రగులుతున్న అగ్ని పర్వతాన్ని
నీ చూపులు శూలాలై గుచ్చుతునన్నా
నీ మాటలు గుండెను కాల్చేస్తున్నా
నా సహనాన్ని నేనే పరీక్షిమంచు కుంటున్న.....లావాని నేను

నువు నమ్మిన తప్పే, తప్ప కానప్పుడు
నా నిజం, నిజం కాకుండా పోతుందా
నీకున్న బలంతో ప్రపంచాన్ని మొత్తాన్ని నమ్మించినా
నా నిజం ....నిప్ప.....ఆగుతుందా....ఆపగలవా?
అబద్దాల ఆట నుండి తప్పకో
సామాజిక న్యాయం వైపు సాగిపో

కార్చిచ్చు మొదలవ్వక ముందే
లావా మరిగిపోక ముందే
నేను నిశ్శబ్దాన్ని ఛేధించక ముందే
నిజాన్ని ఒప్పకో
నా వాటా నుండి తప్పకో

[ ఎస్సీల వర్గీకరణలో వెనుకబడ్డ 57 కులాల తరపున]

## నేలకొరిగిన చీకటి రాత్రి - సాజీగోపాల్

తుపాకీ కాల్పులతో దద్దరిల్లిన ఆ చీకటిరాత్రి
తుటాలవాన కురిసింది
క్రూరత్వం బయటపడిన ఆ కాళరాత్రి
ఒక అమాయక ప్రాణం నేలకొరిగింది
ఉలిక్కిపడి నిద్రలేచిన ఆ నగ్నరాత్రి
ఒక ఊపిరి ఆగిపోయింది

నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తున్న యువకునిగా
తన ప్రియురాలి ఇద్దరి పిల్లలకు తండ్రిగా
మరునాడు పెళ్ళికావలసిన పెండ్లికొడుకుగా
న్యూయార్క్ నగరంలో కలలు కనేవాడు "షాన్ బెల్"

పెళ్ళికి ముందురాత్రి
మిత్రులతో ఇంత ఆనందం పంచుకుందామనుకున్న వేళ
స్వప్నలోకం లో విహరిద్దామనుకున్న వేళ
బైర్లు కమ్మిన ఖాకీవిస్కీ కళ్ళకు
విచక్షణ కోల్పోయిన పోలీసు తుపాకులకు బలైపోయినాడు

పౌరహక్కుల కోసం ఉద్యమించిన
మార్టిన్ లూథర్ కింగ్ ను చంపిన దేశంలో
నల్లజాతి హక్కులకోసం పోరాడిన
మాల్కంఎక్స్ ను నరికిపోగులు పెట్టిన దేశంలో
మిలిటెంట్ పోరాటాలకు పిలుపునిచ్చిన
బ్లాక్ పాంథర్స్ ను వేటాడి చంపిన దేశంలో
నలభై ఒక్క బులెట్లతో
"అమదో దియాలో" ను చంపిన పోలీసులను
అమాయకులని తేల్చిన న్యాయస్థానాలున్న దేశంలో
నల్లవారయితేచాలు ఊచకోత కోసిన ప్రదేశంలో
ముమియా అబూజమాల్ ను ఉరికంబం పై నిలబెట్టిన సమయంలో
మానవహక్కులే ప్రశ్న
పోరాటమే మార్గం.

(న్యూయార్క్ నగరంలో పోలీసు దురాగతాలకు బలిపోయిన అమదో దియాలో, 23 సంవత్సరాల షాన్ బెల్ లాంటి ఎందరో అమాయకులను గుర్తుచేసుకుంటూ ...)

మా నాన్న భౌతిక ప్రపంచంలో మాకు దూరమై అప్పటికి నాలుగు రోజులైంది. చిత్తడి జల్లులాగ గాలికి అశ్రువులు కురుస్తున్నాయి. వాతావరణమే తేమగా వుంది.

ఇంటిముందు వరండాలో పడక కుర్చీలో కూర్చొనివున్నాను. అఖిల ప్రపంచాన్ని ఆవరించి వున్న కాఱుచీకటి కంటికెదురుగా కనబడుతూవుంది. అంత కంటే గాఢంగా కమ్ముకుంది హృదయంలో చీకటి. వీనికైక్యం కలిగించడానికి కళ్ళు మూసుకున్నా. అవ్యక్తమైన ఆలోచనలెన్నో బుఱ్ఱలో గిఱ్ఱున తిరుగుతున్నాయి. దగ్గరగా మంచం మీద మా రాజ్యలక్ష్మి కూర్చుని వుంది కుమారునితో. ఆ కృష్ణుడు గోడకు తగిల్చిన దీపాన్ని చూస్తూ, నవ్వులు వెదజల్లుతూ ఉన్నాడు.

చిన్నపిల్లలేవో పుస్తకాలు ముందు వేసుకుని చాపమీద చదవడం కంటె ఆర్భాటం ఎక్కువ చేస్తున్నారు. మా అమ్మ ముసుగుతో తలవంచుకుని గోడవార కూర్చుని వుంది. పనిపాట్లల్లో మునిగి వున్నారు లోపల మిగిలినవారంతా. మేము నిశ్శబ్దంగా వుండడంచూచి పిల్లలు కూడా క్రమక్రమంగా తమ చదువును కాగితాలు తిప్పడం కిందకు మాత్రమే మార్చారు. ఆలొచనలేమీ లేకున్నా ఆలోచిస్తున్న వారిలాగ అదో రకంగా నెమ్మదిగా వున్నాం.

'అమ్మా! చిన్నబాబుగారున్నారా?' అనే ప్రశ్న చెవుల్లో దూరింది. కళ్ళ తలుపులు తెరుచుకున్నవి.
'అదో కుర్చీలో పడుకొని' అంది నెమ్మదిగా మా అమ్మ.
'ఏమిరా వెంకన్నా?' అన్నాను.
మెడ మీద వున్న దుప్పటిదీసి క్రిందపడవేస్తూ వరండా మెట్ల మీద నిల్చున్నాడు మాదిగ వెంకన్న.

'బాబూ ఇలా దయచెయ్యండి ఓ మారు' అన్నాడు చేతులు కట్టుకొని
'ఏమిటో చెప్పు ఇక్కడే వున్నానుగా. నాకు లేవడానికి బద్ధకం'
'ఒక్క అడుగు ఇక్కడికిదయచేయండి' అన్నాడు వెంకన్న చేతులు వెనక్కి పెట్టుకుంటూ
మాటలను విని లోపల నుండి వచ్చి తలుపుకానుకొని నిల్చున్న మారెండో అమ్మాయి సుమతి అంది' నాకు తెలుసులేరా ఈ వేళ ఆదివారమన్నయ్యా సంత దినం'
అమ్మాయికి తెలుసునేమోగానీ నాకుతెలిసినట్టెక్కడా సాక్ష్యం లేదు
'వెళ్ళన్నయ్యా కానుకలిస్తాడు' అంది మరీ సుమతి
'ఏమీ లేదండీ బాబూ! ఇదో ఇక్కడికి ఓ మారు' అన్నాడు వెంకన్న
'సరే' నంటూ లేచి మెట్లవద్దకు వెళ్ళాను
రెండు చేతుల్లో వున్న తెల్లని కాగితాల పొట్లాలు ముందుంచి నమస్కారం చేసి 'తీసుకోండి' అన్నాడు వెంకన్న
'ఏమిటవి' అశ్చర్యపడ్డాను.

‘నేం చెప్పలేదా? ప్రతి ఆదివారమూ వెంకన్న ఈ వేళకు సరిగా పంచదారా పటికబెల్లమూ పొట్లాన నాన్నగారికి తెచ్చి ఇచ్చి నమస్కారం చేసేవాడు. నాన్నగారు వాని భక్తికి ఎంతో పొంగిపోయేవారు ఆ తరువాత వారు అర్ధరాత్రి వఱకు మాట్లాడేవారు నాన్నగారికి బదులు ఈ వేళ మీకయింది ముందే అన్నాను గదూ?’ అంది అంతా ముందే చెప్పినట్టుగా సుమతి.

‘అతను అలా చేయడం మామూలే’ అని మా అమ్మ కూడ అనడం పొట్లాలు తీసుకున్నాను
తరువాత వెంకన్న అన్నాడు ‘బాబుగారూ’ నాన్నగారి జోడు - నేను స్వయంగా కుట్టి యిచ్చినది - ఎక్కడొ ఇంట్లో వుంటది అది మాత్రం నాకిప్పించ్చండి. నా గుడిసెలో వేలాడకట్టుకుంటాను పెద్దబాబుగారిని తలచుకుంటూ’
‘ఇదేమిట్రా జోడు కావలంటున్నావు. ఇంతకంతే వేరే యేమీ నీకు తోచలేదా? పటమా, భాగ్యమా, ఇంకొకటా?’ అన్నాను.
‘అదేనాకిష్టమైనది వేరే యేమీవద్దండి. నా కింక కావలసింది ఏమీ లేదు’ బాబు గారు పోయారు. నా బతుకు పాడయింది; ఇంకా అవుతుంది. నేంగూడా బతకను. బతకనివ్వరుకూడా’ అంటూ కాళ్ళ మీద పడి భోరున ఏడవటం మొదలుపెట్టాదు వెంకన్న.

నాకూ దు:ఖం వచ్చింది నాలుగుదినాల క్రిందట ఏ బా యెఱుగని మా నాన్న హటాత్తుగా ‘ఇదిగో, ఇంక నేనులే’ నంటూ అనంతవిశ్వంలో లీనమైనది మరల ఒక్కమారు మనోవీధిలో మెరిసిపోయింది మరల గాలివీచింది అశ్రువులు వర్షించాయి.

దు:ఖమాపుకున్నాను వెంకన్నను లేవనెత్తాను శాంతపరచాను.

మా నాన్నగారికి మావూరి మాలమాదిగలంటే ఎంతో దయా సానుభూతీ వారి కుర్రాళ్ళకు వూరివాళ్ళందరిని ధిక్కరించి చదువు చెప్పారు. వారి వ్యవహారాలు తన చేతి మీదుగా నడిచేవి. వారికేవయినా రోగాలు వస్తే రాత్రింబవళ్ళూ మేలుకొని వారికి సేవ చేసేవారు. వారికేం కావలసి వచ్చినా అచ్యుతరావుగారి సలహా గావాలి. వారు చేయగలిగినన్నివిధాలా వారికి సాయం చేసేవారు. వారందరిలో వెంకన్నకు మా నాన్నగారిపైన భక్తిప్రేమలెక్కువ

ఇదంతా నాకు తెలుసును. అయినా ఎపుడో గాని నాలుగురోజులు ఇంట్లో వుండనందున నాకా జోడు మాహాత్యం తెలిసింది కాదు. వెంకన్న అలా మాట్లాడటానికి కారణం అవగాహం అయింది కాదు
‘వెంకన్నా! ఏమిటి విశేషం. నాన్నగారి మృతి మాకే కాకుండా మీ అందరికీ కూడా నష్టకారణమయింది దానికి నా హృదయవేదన మితిమీరుతూ వుంది’
‘జోడు సంగతి జెప్పవలనంటే ఓ పెద్ద కథవుతుంది బాబూ! అది అమ్మగారికి తెలుసు ఇంట్లొ అందరికి తెలుసు’ అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ

'ఔనురా నాయనా! నాకిప్పుడు జ్ఞాపకం వచ్చింది, జోడు సంగతి మీనాన్న వుండగా నీకది తెలిసివుంటే నీవు నిజంగా సంతోషపడేవాడివి ఇప్పుడు వింటే నీకది మరింత వేదన కలిగిస్తుంది' అంది మా అమ్మ నెమ్మదిగా

నేను ముందొకమారు వచ్చాను అప్పుడు అబ్బాయి నెత్తుకొని నాన్న 'నీకు కూడా జోడు కావాలా, వెంకన్న కుట్టిస్తాడు' అంటూ ఆడించేవారు అప్పుడు నేనడిగితే దాని సంగతంతా నాకు చెప్పి 'అన్నయ్యకిది తెలియనీయవద్దు. వాడు కోప్పడతాడు అన్నారు నిన్ను డబ్బు అడగలేక నీకు కష్టం అవుతుందేమో అని ఇలాంటి బాధల పడ్డ తండ్రి' - తరువాత మాట్లాడలేక పోయింది రాజ్యలక్ష్మి
సుమతి కథంతా చెప్పింది మధ్యమధ్య మా అమ్మా రాజ్యలక్ష్మీ కొన్ని విషయాలు చేరుస్తూ వచ్చారు

*****

వెంకన్నది పెద్ద కుటుంబము 'పిల్లా జెల్లా కలిసి పదిమందుంటారు. వ్యవసాయంలో తోడ్పడే తమ్ముళ్ళిద్దరున్నా గ్రుహభారమంతా తనమీదనే వుంది భూమిబుట్రలు కొద్దిగా వుండేవి అవయినా మెరకభూములు అప్పుడప్పుడూ వానదెవుడు 'శీతకన్ను' వేస్తూ వచ్చాడు ఇంతలో అర్థికమాంద్యం బరువెక్కువైంది అందుచేత సంసారానికయే బడ్జెటు తీర్మానాలు తల్లకిందు లౌతువచ్చాయి కాబట్టి అప్పులైనవి రాగలిగినంతా లాగి తుదకు భూములు లాగేశారు ఋణదాతలు. చాలినన్ని భూములు లేనందుచేత ఇంకా కొన్ని అప్పులలాగే నిల్చిపోయినవి. అలాంటిదే పిండు భీమయ్యగారి అప్పకూడా

ఆ నిరుడు వెంకన్నకు పొలాల్లో తినడానికి సరిపడే గింజలు కూడా రాలేదు మళ్ళీ పొలాలు విత్తవలసిన కాలం వచ్చింది దానికి పైకంతో అవసరం వచ్చింది అప్పటికే కావలసినన్ని అపులున్నై అయినా భీమయ్య వద్దకు వెళ్ళాడు వెంకన్న నూరు రూపాయలు అడిగాడు ఆ యేడే తప్పకుండా పంటకాలంలో వున్న ధరకే తాను పండింపబోయే వేరుశనగ అసలుకు వడ్డీకి తనకే యిస్తానన్నాడు పదింటికి పావలా వడ్డీకంగీకరించాడు. భీమయ్య డబ్బు యిచ్చాడు. ఆ యేడు వున్న భూమినంతా వెరుసెనగ వేస్తే కొంత అప్ప తీర్చుకొని నాలుగు డబ్బులు చేతిలో వుంచుకోవచ్చుననుకున్నాడు వెంకన్న అయితే ఆ యేడు వానదేవుడు యిష్టం వచ్చిన చోటనే వర్షానికి ఆర్డరిచ్చాడు వెంకన్న పైరు పాడయిపోయింది అతనికేమీ దిక్కుతోచిందికాదు ఆ తరువాత అప్పలవాళ్ళందరు భూములు లాక్కోవటం, సంసారం చీలిపోవటం, తనపాలికివచ్చిన భీమయ్య అప్ప పెరిగిపోవడం, కూలినాలి చేత జీవనం జరపడం వెంకన్న సంసారంలో జరిగిన మార్పులు

'అప్పలు వసూలు చేయడంలో ఇంటి పేరు సార్ధకం చేసే పిండుభీమయ్య అప్ప తీర్చడమెలాగ?' ఈ సమస్య వెంకన్నను బాధపెట్టడం ఎక్కువయింది ఎక్కడో ఒక లేగదూడను సంపాదించాడు వెంకన్న సంవత్సరమున్నర కంటవత్తిడుకుని పెంచాడు. ఆఖరుకది నూరు రూపాయలు చెసేకోడెగా తయారైంది. వెంకన్నకు ధైర్యం వచ్చింది.

ఒకనాడు వెంకన్న కోడెను తీసుకొని భీమయ్య వద్దకు వెళ్ళాడు 'కోడెకు నూరు రూపాయలు ధర కట్టారు. దాన్ని తీసుకొని వడ్డీని లెక్కించకుండా పత్రాన్ని ఇచ్చి రక్షించండి ఆకోడె తప్పా వేరుమార్గం లేదు అప్ప తీర్చడానికి అని ఎంతో దీనంగా చెప్పకున్నాడు.

అప్పటికి భీమయ్యకు ఇవ్వవలసిన మొత్తం మూడేళ్ళకు 190 రూ అసలు తనకు వేరుశనగ ఇవ్వలేదు. ఆఖరుకు తన అప్పకు భూమి కూడా మిగల్లేదు ఆ కోపం వుంది భీమయ్యకు. మా నాన్నగారు కూడా పత్రాన్ని యిచ్చి బీదవాణ్ణి రక్షించమని చెప్పిచూశారు భీమయ్యకు. వుపయోగం లేకపోయింది పైగా మాదిగకుంకని వెనక వేసుకొనవస్తున్నారని మా నాన్నగారిపైన దురభిప్రాయం కలిగింది

ఏమైందో యేమో వారంరోజుల్లో ఆ కోడె హటాత్తుగా చనిపోయింది. దాంతో వెంకన్నకి మతి పోయింది.

అదివఱకే పత్రానికి అయువుదగ్గరించింది అందుచేత భీమయ్య చెప్పి పంపాడు. వెంకన్న కోడెను తీసుకొనివస్తే యేదో విధంగా పరిష్కారం చేసుకుందామని వెంకన్న మాచెర్లవైపే తిరిగిచూడలేదు. భీమయ్య నయాభయాలు రెండూ వెంకన్నను కదిలించలేదు. అతడు షావుకారికి ముఖం చూపలేదు.

పత్రానికి మేర మీరింది గత్యంతరం లేక ఎవరిచేతనో పత్రానికి చెల్లువ్రాయించుకున్నాడు భీమయ్య. పత్రానికి ప్రాణం వచ్చిందనుకున్నాడు వెంకన్నకి ఆ సంగతి తెలియదు
ఉన్నట్టుండి వెంకన్నకు గుంటూరు డిస్ట్రిక్టు మునిసిఫ్ కోర్టు నుండి సమను వచ్చింది. భీమయ్య పత్రం దాఖలు చేసాడు.

ఎప్పటిలాగే భీమయ్య తన కేసుకు నారాయణాచారిని తన వకీలుగా నియమించాడు. ఆచార్లు ధనవంతుడు, పలుకుబడి గలవాడు; మావూళ్ళో అదిమరింత. అయినా మా నాన్నకు శిష్యుడు ఆయనయెడ గురుభావం గలవాడు. డబ్బుగడించేదాల్లో మాత్రం ఆచార్లు తొక్కని త్రొవే లేదు

వాది వకీలు 'ఫలానా' ఏ అని తెలిసిన తరువాత మా నాన్నకొకవిధమైన ధైర్యం కలిగింది. మొదట నుంచీ జరిగిన సంగతీ, అసలు పత్రంలోని దొంగ చెల్లు, వెంకన్న దీనదశా ఆచార్లగారికి తెలియచేస్తే తనపైన వుండే గురుభావంతో భీమయ్యకు చెప్పి వెంకన్నను రక్షిస్తాడని మా నాన్న ఆశయం. అయితే స్నేహితానికి, గురుత్వానికి, సాయానికి వచే డబ్బు పోగొట్టుకొని తన క్లయింట్కు అసంతృప్తి కలిగింపడు వకీలు అది మాత్రం మరచారు మా నాన్న

కష్టపడి నాలుగురూపాయలు సంపాదించుకొన్నాడు వెంకన్న. మా నాన్న వెంకన్నను తీసుకొని గుంటూరు వెళ్ళారు ఆచార్లను దర్శించారు వెంకన్న కనపడుతూనే వకీలు 'ఏమిరా! మాగిద వదవవు ఇచ్చిన డబ్బు ఎగవేయడమే కాకుండా పిలిపిస్తే కూడా కనపడకుండా తిరుగుతావు?' అని నాంది మొదలుపెట్టినారు

సావధానంగా వకీలుకు అన్ని విషయాలు చెప్పారు మా నాన్న వెంకన్న దుర్భర పరిస్థితుల్లో వున్నా అప్పు తీర్చడానికి ప్రయత్నించాడనీ భీమయ్య గర్వంతో, ఆశతో అవకాశం పొగొట్టుకున్నాడనీ, పత్రానికి మేరమీరింది గనుక దిక్కు లేని వెంకన్నను బాధించడం వల్ల ఉపయోగం లేదనీ మా నాన్న వాదన

దానికాచార్ల వారి బదులిది 'ఈ వెధవకింత పొగరా? వీన్ని జైలుకు పంపిస్తాను లేకపొతే జీవితమంతా భీమయ్య వద్ద జీతానికుండి అప్పు తీర్చేటట్టు చేస్తాను అంతేగాని వీరి విషయంలో మీరు జోక్యం చేసుకుంటే నాకు చాలా నొప్పి గలుగుతుంది నన్నెనా చూచి వీనికి మీరు సాయపడగూడదు

ఆచార్లు ఏవేవో చెప్పి వెంకన్న చేతి బొటనవ్రేలి గుర్తు వేయించుకో చూచేడు మా నాన్న అది కానీయకుండా కళ్ళతోనే సైగ చేశారు మా నాన్న పట్టుదల ఆచార్ల అమితాగ్రహానికి కారణమైంది.

పత్రానికి వ్రాసిన చెల్లు అసలు తప్పని కోర్టులో నిరూపించాలని మా నాన్న పట్టుపట్టారు మిగిలిన మార్గమదొక్కటే ఈ విధంగా న్యాయానికై పొరాడ్డానికి కాలమూ, డబ్బూ సహాయమూ కావాలి దరిద్రులకు మొదటిది పుష్కలంగా వుంటుంది తక్కినవి రెండూ దొరకవు

వారు తిరిగి యింటికి వచ్చారు. ఈసారి వాయిదాకు వెళ్ళాలి కర్చులకు డబ్బూ వాయిదా వారంరోజులుంది మా నాన్న ఆస్తీ, ఆదాయమూ కుటుంబం పొట్టకు సరిపొతుంది కానీ కాని ముడికిరాదు ఏదో విధంగా కొంత డబ్బు సముదాయించుకున్నారు కోర్టు కర్చులకు అయితే రాకపొకలకు?

డబ్బు కొరకు బాధపడ్డంకంటె నడిచి వెళ్ళేదే మంచిదనుకున్నారు. గుంటూరికి మావూరు పాతికమైళ్ళకు పైగా వుంటుంది నడిచే ఓపిక కొంచెమైనా లేకున్నా అంగీకరించారు మానాన్న నడవడానికి వెంకన్నకు కొత్త జోడుపైన తన మిత్రున్ని, సహాయుణ్ణి తీసికొని వెళ్ళాలని మోజు పుట్టింది. వెంటనే పని ప్రారంభించాడు రెండు దినాలు నిద్రాహారాలు మానేసి ముగించాడు క్రొత్తజోడును. ప్రయాణానికి రెండు విమానాలని సిద్ధపరచినంత సంతోషించాడు వెంకన్న. వాని ఉత్సాహమూ కృతజ్ఞతా చూచి మురిసిపోయాడు మా నాన్న దరిద్రులకు కష్టజీవులకు పరస్పర బహుమానాలటువంటివే. ఆ చెప్పులే మా నాన్నను గుంటూరికి తీసికొనివెళ్ళి తీసికొనివచ్చినవి. కోర్టులో 'అన్సరు' పెట్టుకుంటామని చెప్పించారు. వారికి సరియైన వకీలును కుదుర్చుకున్నారు తిరిగివచ్చారు.

అప్పటి నుండీ ఆచార్లు , భీమయ్యవారి తాలుకూ మనుష్యులకు మా నాన్న అన్నా, వెంకన్నన్నా అతిచేదై పోయింది బలవంతులకు ప్రాపకం జాస్తి కాబట్టి బీదవాళ్ళ మీద కష్టాలు కురిశాయి, కురిపింపబడ్డాయి. ఏమైనా సరే యీ కేసులో న్యాయం కలగడానికి దేనితోనైనా పోరాడాలనుకున్నారు స్నేహితులిద్దరూ కానీ స్వల్పకాలంలొనే ఒక్క మరణం తోటి ఒక్కదినమైనా పోరాడలేకపోయారు మా నాన్న

వెంకన్న మొదలు పెట్టాడు 'విన్నారా బాబూ! ఎన్నో కష్టాల్లో అడుగామడగా నడుస్తున్నా అన్యాయం జరుగుతూ ఉంటే చూళ్ళేక వృద్ధాప్యంలో గుంటూరు వఱకూ వచ్చారు నాకోసరము నా జోడును ఎన్నో మార్లు మెచ్చుకున్నారు అంచేత దాన్ని బాబుగారి జ్ఞాపకార్థంగా వుంచుకుంటానన్నాను నాకింకీమీ వద్దు '

సత్యంగా ఆ జోడు గొప్పత్యాగాన్ని చూచింది గొప్పపనికి తోడ్పడింది అటువంటిది తప్పకుండా జ్ఞాపకచిహ్నామే వెంకన్నా నీ హృదయం ఎంత ఉత్తమమైంది?

## చివరి కోరిక - డా. ఎస్.వి. రామరాజు

మాకు దసరా సెలవులిచ్చి పది రోజులయింది. ఇంటి ముందే సుధతో వేపచెట్టు కింద గోళీలాడుకుంటున్నాను. సాములు, బంగారయ్యా మటోడొచ్చి లింగయ్యగారి చెరువుకట్టమీద నేరేడుగాయలు కోసుకొద్దామన్నా వెళ్ళబుద్ధి కాలేదు. తర్వాతొస్తా మీరెళ్ళండని చెప్పి వసారా దగ్గరగా పొగ వస్తున్న వేపు ఒకసారెళ్ళాను. తీపి, నేతి వాసనతో చుట్టుపక్కలంతా ఘుమఘుమలాడిపోతోంది. నా నోరు నీటితో నిండిపోతోంది. గోళీలాట మీద మనసు నిలవడం లేదు. నాకు పనుందని సుధని పంపేశాను.

కర్ర టకటకలాడిస్తూ వచ్చిన నత్తల గురవయ్య తాత వేపచెట్టు కింద నులకమంచం వాల్చి కూర్చుంటూ చుట్టముక్క చూపిస్తూ అగ్గికోసం సైగ చేశాడు నన్ను. లోనికెళ్ళడానికేమీ వంక దొరకని నాకు నిప్పు కణిక వంకతో లోనికెళ్ళాను. స్వీటు ఏ దశలో ఉందో చూడొచ్చన్న ఆశతో. అప్పడే బాదంకాయి స్టీలు ప్లేటులో సర్దుతోంది మా అమ్మ పసుపురంగులో ఉన్న స్వీటుని.
"గురవయ్య తాతొచ్చాడు నాన్న," అన్జెప్పి మండుతున్న చింతపుల్లను తీసుకెళ్ళాను.
తాత చుట్ట ముట్టించుకొని గుప్పగుప్పన పొగ వదుల్తుంటే చూడ్డం నాకో సరదా!

గురువయ్య తాతది కూరెటిపాలెం. గొడ్ల వైద్యం చేసేవోడు. ఒక చేత్తో చుట్ట ఇంకో చేత్తో బాణాకర్ర పట్టుకొని ఠీవిగా నడుస్తుంటే సినిమాల్లో ఎస్వీ రంగారావులా ఉండేవాడు. ఎపడూ నవ్వుతూ ఎదుటోళ్ళకి ఏదో చెప్పి నవ్వించేవాడు. గురవయ్య తాత నాన్న, వాళ్ళ తాత కూడా గొడ్ల వైద్యం చేసేవాళ్ళంట! చుట్టుపక్కల ఊళ్ళే కాక, తెనాలి దాకా ఇటు పొన్నూరు నుంచి అటు రేపల్లె దాకా తాత అందరికీ తెల్సు. తాత జిల్లేపల్లి దాసుల్ల దగ్గర ఐదో తరగతి వరకు సంస్కృతం చదువుకున్నాడంట! ఎక్కాలు ఇరవై దాకా కింద నుంచి పైకి, పై నుంచి కిందకు గుక్క తిప్పుకోకుండా చెప్పేవాడు. ఆయన చెబుతుంటే మేమంతా గుడ్లెల్లబెట్టి వినేవాళ్ళం. తాతని అందరూ గురువయ్యగారనే పిలిచేవారు. ఎక్కడ గేదె ఈనలేకపోయినా, ఎవరిదైనా ఎద్దు కాలిరిగినా తాత వెళ్ళాల్సిందే! గూడవల్లిలో పశువుల ఆస్పత్రి వచ్చినా ఆ ఊరి కమ్మవారంతా తాతనే పిలిచేవారు, ఏ గొడ్డుకు ఏ ఇబ్బంది వచ్చినా! తాత రామాయణం, భాగవతం చెబుతుంటే వింటానికి రెండు చెవులూ చాలేవి కావు.

ఎప్పుడైనా వైద్యం చేయడానికి మా ఊరొస్తే మా ఇంటికి తప్పకుండా వచ్చేవాడు తాత. ఒకవేళ మా నాన్న ఇంట్లో లేకపోతే నక్క సూరినారాయణ బాబాయి దగ్గరకెళ్ళేవాడు. వాళ్ళిద్దరూ కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి బళ్ళారి జైలులో ఆరునెలలపైగా జైలుశిక్ష అనుభవించారట! చుట్టుపక్కల ఊర్ల జనం వీళ్ళిద్దర్నీ పెద్ద హీరోల్లా చూసేవాళ్ళు.

మా నాన్న వచ్చి తాత ఎదురుగ్గా నవారు మంచం వాల్చి కూర్చుంటుంటే, "ఏంటి అల్లుడూ! ఈపూట ఘుమఘుమలాడిపోతుంది వాతావరణం! చూడబోతె దంతాలకు పని తగిలేలా ఉందే!" అంటూ చుట్టముక్కను ఆర్పేసి దూరంగా పడేశాడు.

“రవ్వకేశరని కొత్తరకం స్వీటు, భట్టిప్రోలు కోటయ్య చెబితే చేయించా! తిని చెప్పాలి ఎలా ఉందో,” అంటుండగానే, మా అమ్మ రెండు ప్లేట్లలో స్వీటు తీసుకొచ్చింది. నేను ముక్కాలిపీట, ఇత్తడి చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి ఇద్దరి మంచాల మధ్యన పెట్టి అమ్మ వెంట లోనికెళ్ళాను స్వీటు తింటానికి.

నేను బయటికొచ్చేసరికి తోకల లక్ష్మయ్య, సలగాల దుర్గయ్య, పఠ్రె బసవయ్య, నక్క సూరినారాయణ బాబాయి తాత చుట్టూ కూర్చుని ఉన్నారు. తాత కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన సంగతులు చెబుతుండగా భట్టిప్రోలు పెంటు సాయిబు ‘సేమియా’ అంటూ వచ్చి చెట్టు కిందున్న తాటిమట్ట మీద కూర్చున్నాడు. ఆయన ఎదురుగా కాళ్ళ దగ్గర తట్టలో సేమియా డేగిశా పెట్టుకున్నాడు. కండువాతో ముఖం తుడుచుకుని తాత చెప్పే మాటలు ఆలకించసాగాడు.

“ఇంతకీ రవ్వకేసరి ఎట్టా ఉందో చెప్పలేదు,” అన్నాడు మా నాన్న తాత చెప్పే మాటలకడ్డు తగుల్తూ. తాత చెప్పడం కొంచెంసేపాపాడు.

“మీలో గంజెవరన్నా తాగారా?” అన్నాడు తేరిపారా అందరివంక చూస్తూ.

కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉన్న తర్వాత అందరూ ఒక్కసారిగా ఘుొల్లున నవ్వారు.

“నా మాట నవ్వులాటలా ఉందా?” అన్నాడు సలగాల దుర్గయ్య వంక చూస్తూ.

“కాకపోతే మరేంది బాబాయ్! గంజిలో పుట్టి గంజిలో మెతుకులా పెరిగి ఆ గంజినే తులసినీళ్ళలా తాగి చచ్చేటోళ్లం. గంజి తాగారా మీరెప్పుడన్నా అంటే నవ్వకేంజేత్తారు?” అన్నాడు వేదాంతిలాగా.

అయితే నే తాగిన గంజి సంగతి చెబుతా! అలాంటిదెవరైనా తాగారో లేదో చెప్పండంటూ చుట్ట ముట్టించి రెండు దమ్ములు లాగి గుప్పుగుప్పుమనిపించి చెప్పసాగాడు.

“మూడేళ్ళ క్రితం కొత్తపాట సందుమాట! అప్పుడే దసరా పండగెళ్ళి వారంరోజులైంది. అద్దేపల్లి కరణం గారింట పుట్టిన కోడెదూడ ముందుకుడికాలు గిట్టకు దెబ్బ తగిలిందంట, బుర్రతూము దగ్గర. నే వెళ్ళేసరికి మద్దుల లాలలజపతిరాయ్‌గారి బావి పక్కనున్న గొడ్లసావిట్లో ఉందది. కాలు గిట్ట పూర్తిగా చీలిపోయింది. నేల మీద నిలవలేక కాలెత్తి నుంచుంది. దానికి వసర కట్టేసి నిలబెట్టేసరికి సూర్యుడు నెత్తిమీదకొచ్చాడు. పొద్దుననంగ తినెళ్ళిన చద్దనం ఎటుపోయిందో కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. తొందరగా ఇంటికి జేరదామని కనగాల పెద్ద వంతెన మీదుగా వెళ్తుంటే పద్మావతి టాకీసు దగ్గరొక ఆడమనిషి నా కాళ్ళకడ్డం పడింది. చింపిరి తల, చిరిగిన రవిక, మాసిక లేసిన పాతచీర. ఆమె అవతారం చూసి అడుక్కునేదేమోననుకున్నా.

“ఏం కావాలమ్మ?” అనడిగాను.

“రెండ్రోజుల్నుంచి తన గేదె ఈనలేక బాధపడుతుందని... పిలిత్తే వత్తావో రావోనని పిలవలేదని... ఇంటికీ దారెంట ఎల్తావు కదాని కాచుక్కూర్చున్నానయ్యా. నువ్వే ఈ మూగజీవాన్ని కాపాడి దూడని ఒడ్డున పడెయ్యాలయ్యా,” అంటూ ఏడుస్తూ నా కాళ్ళు చుట్టేసిందా ముసలమ్మ.

తాటాకు గుడిసె, దాని మీద దట్టంగా పాకిన సొరపాదు, ఆకుల మధ్యలోంచి అక్కడక్కడ కాయలు కన్పిస్తున్నాయి. గుడిసె ముందున్న కట్టగొయ్యకి కట్టేసిన కంత్రిమాళీ గేదె బొంగరంలా తిరుగుతుంది. తొలిచూలులా ఉంది. ఎప్పట్నుంచి తిరుగుతుందో అక్కడంతా గుంటలు పడి రొచ్చురొచ్చుగా తయారైంది.

దూడ అడ్డం తిరిగింది. దాన్ని బయటికి లాగి మాయ తీసి శుభ్రం చేయాలంటే గంటపైగా పడుతుంది. కడుపులో ఎలుకలు గొడవ చేస్తున్నాయి. ఇంటికెళ్ళి ఓ ముద్ద ఎంగిలి పడొస్తానమ్మా అని చెప్పాను.

"నువ్వెళ్ళిపోతే నోరులేని జీవం పాణాలు అన్యాయంగా గాల్లో కలిసిపోతాయయ్యా. రెండుసార్లు కట్టి ఊనేసిందయ్యా. మూడో కట్ట నిలబడింది. నాకున్న ఆధారం అదొక్కటే. పాలిడిచిన దగ్గర్నుంచి కన్నబిడ్డలా సాకానయ్యా. దేవుడిలా వచ్చావు. నువ్వే కాపాడాలంటూ," గోలగోలగా అరుస్తుంది.
డమనిషిని చూస్తే జాలేసింది. చేతికర్ర గుడిసె తడిక్కానించి, పంచె పైకి ఎగ్గట్టి పనిలో దిగి దూడను లాగి తీసేసరికి గంటపట్టింది. పెయ్యి దూడని తీసినంతసేపు నా కాళ్ళకడ్డం పడుతూ అక్కడే తిరుగుతుంది. పెయ్యి దూడని కోక చెంగుతో తుడుస్తూ దాని కాలిగోళ్ళు గిల్లుతుంది. నేను కాలువలో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకొచ్చేసరికి పచ్చగడ్డి మేస్తోంది గేదె. దూడకి పాలు తాగిస్తుందావిడ. నాకు ఆకలి నకనకలాడుతుంది. గుడిసె ముందున్న నక్కేరు చెట్టుకిందున్న కూసం విరిగిన కుక్కి మంచం మీద ఒకపక్క ఒకరి కూర్చున్నా కాళ్ళు, చేతులు కండువాతో తుడుచుకుంటూ. ఆకలితో నీరసంగా ఉంది. ఇంటికెళ్ళే ఓపిక కూడా లేదు. నడుం వాల్చడానికి అనుకూలంగా లేదా మంచం. కొంతసేపటికి ఆవిడ గుడిసె వెనక్కెళ్ళి నవనవలాడే లేత సొరకాయను కోసుకొచ్చింది నాకివ్వడానికన్నట్టు. "నాకు చాలా ఆకలిగా ఉంది. ఇప్పుడిపేమీ అక్కరలేదు, తింటానికేమన్నా పెట్టు," అన్నాను.
"అయ్యా! మీబోటోళ్ళు మా ఇళ్ళల్లో తింటారా?" అంది అనుమానంగా.
"ఎందుకు తినం? ఏదుంటే అది పెట్టు," అన్నాను.
"నిన్నట్నుంచి గేదె నొప్పులు పడుతుంటే దాని బాధ సూడలేక దాని దగ్గరే ఉన్నానయ్యా! ఏమీ వండుకోలేదంటూ, కాలువగట్టు మీదున్న ఎండిపోయిన పిచ్చి మిరపకాయ మొక్కల్ని పీక్కొచ్చింది. ఒకపక్క పొంత కుండ దానికానుకుని మట్టితో అలికిన పొయ్యి దిమ్మలోని బూడిద బయటికి లాగి మట్టిసట్టిలో నూకలు, నీళ్ళు పోసి మంట రాజేసింది.

ఎండిన పిచ్చిమిరప మొక్కలు సురసుర మండుతుంటే నా కడుపులో పేగులు అంతకన్నా పెద్దగా అరుస్తున్నాయి. దాహం అవుతోంది. తాగుదామన్నా ఆ గుడిసెలో మంచినీళ్ళ కుండ కూడా ఉన్నట్టు లేదు. అన్నం కుతకుత ఉడకసాగింది. సట్టి మీదున్న మట్టిమూకుడు ఆవిరికి ఎగిరెగిరి పడుతుంది. మధ్యమధ్యలో మూకుడిని తీసి తాటిమట్ట తెడ్డుతో అన్నాన్ని కలతిప్పుతుందావిడ. కొంతసేపటికి గంజి అన్నాన్ని సత్తుగిన్నెలో పోసి ఉప్పు కల్లేసి నా చేతికిచ్చింది. పై కండువాతో దాని అంచులు పట్టుకొని ఆత్రంగా ఒక్క గుటకేసేసరికి నాలుక చురుక్కుమంది. అట్టాగే పట్టుకొని చల్లారేదాగా ఆగి ఆత్రంగా తాగడం మొదలెట్టా! గిన్నె ఖాళీ అయిపోగానే మట్టిసట్టలో మిగిలిపోయిన గంజి అన్నం తెచ్చి పోసింది. అది అమృతం తాగినట్టే ఉంది. కానీ గంజిఅన్నం తిన్నట్టు లేదు. నా ఆకలి తీరేసరికి మట్టిసట్ట ఖాళీ అయిపోయింది. అంత రుచిగల అన్నాం నా జీవితంలో తినలేదు. దాని రుచి ముందు తిరుపతి లడ్డుగానీ, హైదరాబాద్ బిర్యానీగాని, మద్రాసు సాంబారైనా, చివరికి ఈ సెంటు సాయి సేమియా పాయసం కూడా బలాదూరే! ఇంక ఈ రవ్వకేశరెంత?! దేవతల దగ్గరుండే అమృతం

కూడా దిగదుడుపే!'' అన్నాడు ఆ గంజి రుచి గుర్తుచేసుకుంటూ! ఆ ముసలమ్మకు... తప్పు తప్పు... ఆ... అన్నపూర్ణమ్మకు మనసారా దణ్ణం పెట్టుకొని ఇంటికి చేరేసరికి దీపాల వేళయింది.
అందరూ నిశ్శబ్దంగా వినసాగారు. వేపచెట్టు మీద కాకి మాత్రం అప్పుడప్పుడు అరుస్తోంది, ఏమీ తోచక! గాలి కదలడం లేదు. ఉక్కపోతగా ఉంది వాతావరణం. పర్రె బసవయ్య పై కండువాతో ముఖం తుడుచుకుంటూ, ''నిద్ర సుఖమెరుగదు, ఆకలి రుచెరగదని, మాంచి ఆకలి మీదున్నావుగా అందుకే ఆవిడ పోసిన గంజన్నం అంత రుచిగా ఉందిలే మామా!'' అన్నాడు.

''కాదల్లుడూ, అంతకన్నా ఆకలిగా ఉన్న రోజులు నాకెన్నో! ఒక్కసారి ఇల్లొదిలి పని మీద బయలుదేరితే రెండు, మూడు రోజులు

## పాలపిట్టల పాటలు

పరిచయం:

విప్లవకవి వరవరరావు, అల్లం నారాయణ

http://prajakala.org/mag/2007/07/palapittapatalu

.......................................................................

రేలా రేలా రేలా రే

రచయిత: వరవరరావు

గానం: సంధ్యక్క

రేలా రే...రేలా రే... రేలా రేలా రేలా రే

రేలా రే...రేలా రే... తెలంగాణ తేవాలే

రేలా రే...రేలా రే... తెలంగాణ కావాలే

బీడుపడ భూముల్లో జీవనదులు మళ్ళించి

ఆకలిదప్పులు దీర్చే .... ఆకలిదప్పులు దీర్చే తెలంగాణ తేవాలే

రేలా రే...రేలా రే... తెలంగాణ తేవాలే ...

..........................................

రామోజీ ఫిల్మ్ సిటీ

రచయిత: వరవరరావు

గానం: వెంకట్

రండి రండి చూడండి రామ్మోజీ ఫిలిమ్ సిటీ

రంగారెడ్డి జిల్లా ప్రజల కడుపుకొట్టి నిర్మించిన

రమ్యమైన ఫిలిమ్ సిటీ, రంజైన ఫిలిమ్ సిటీ

దివినుండి భువి మీదకి దిగివచ్చిన ఫిలిమ్ సిటీ

శిఖంభూమి రఖంభూమి సంఘీ మింగినవి పోను

చెరువు కుంటలే కావు సర్కారు భూములేకావు

కాలిబాట రాచబాట కబ్జాపెట్టిన ఘనుడు

రండి రండి చూడండి రామ్మోజీ ఫిలిమ్ సిటీ

తొండలు కూడ గుడ్లుపెట్టన పోరంబోకు భూముల్లో

వండర్ లాండ్ సృష్టించిన రామోజీ ఫిలిమ్ సిటీ

బాలీవుడ్ , హాలీవుడ్ డిస్నీలాండ్ బలాదూర్

చంద్రబాబు చలువతోను, ఇంద్రజిత్తు చెలిమితోను

అమితాబ్ మొదలుకొని అందరూ పొగిడిన గ్రాండ్

అసలు రైతు బ్రతుకులకు ఎసరు పెట్టిన బ్రాండ్

……………………………………………

తెలంగాణ వీరగాథ-  బతుకమ్మ పాట

రచన: వరవరరావు

ముందుమాట : ఎన్. వేణుగోపాల్

గానం: సంధ్యక్క

…………………………………………………..

తెలంగాణ అమరులు

రచన: వరవరరావు

ముందుమాట : ఎన్. వేణుగోపాల్

గానం: విమల, సంధ్య, రణం శ్రీను, వెంకట్

------ ------  ముగింపు  ----------------